



# విజయభాను

విశాఖపట్నం, శుక్రవారం 30-06-2023 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 47 సంచిక : 229 పేజీలు : 08 వెల : 1 రూపాయి





## జూలై 3న కేంద్ర కేబినెట్ భేటీ..

### ఆరోజే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ !



దిల్లీ: త్వరలో కేంద్ర మంత్రివర్గం లో కీలక మార్పులు చోటుచేసుకోనున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టే అవకాశమున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే జులై 3న ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రి మండలి భేటీ జరగనుండటం ఈ వార్తలకు మరింత బలం చేకూర్చినట్లయింది. వచ్చే సోమవారం (జులై 3న) ప్రధాని మోదీ.. కేంద్ర మంత్రి మండలితో సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రగతి మైదాన్‌లో కొత్తగా నిర్మించిన కన్వెన్షన్ సెంటర్‌లో ఈ భేటీ జరగనున్నట్లు తెలుస్తోంది. కాగా.. ప్రధాని మోదీ తన నివాసంలో భాజపా సీనియర్ నేతలతో సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికలకు అమలు చేయాల్సిన వ్యూహాలతో పాటు మంత్రిమండలిలో మార్పులు గురించి కూడా ఇందులో చర్చించినట్లు సమాచారం. దీంతో త్వరలోనే కేబినెట్‌లో భారీ మార్పులు జరగనున్నట్లు వార్తలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే కేంద్ర మంత్రులతో ప్రధాని సమావేశం కానుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతమున్న మంత్రుల్లో కొందరికి ఉద్వాసన పలికి.. కొత్తవారికి చోటు కల్పించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అయితే, సాధారణంగా పార్లమెంట్ సమావేశాలకు ముందు కూడా మంత్రి మండలి సమావేశమవుతుంది. జులై మూడో వారం నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. మరి మోదీ భేటీ.. పార్లమెంట్ సమావేశాలకా? మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకా? అన్నది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే..!

ఇదిలా ఉండగా.. గత కొన్ని రోజులుగా ఇటీవల పార్టీ అధ్యక్షుడు నడ్డా, హోంమంత్రి అమిత్ షా, పార్టీ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్.. రాష్ట్రాల వారీగా నేతలతో సమావేశాలు జరిపారు.

లోక్‌సభ, పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా రాష్ట్ర స్థాయిలో సంస్థాగత మార్పులు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కొన్ని రాష్ట్రాల్లో నాయకత్వ మార్పులు కూడా ఉండొచ్చని సమాచారం.

## ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

- కారుణ్య నియామకాలకు ఓకే
- త్వరలోనే ఉత్తర్వులు జారీ



అమరావతి (విజయభాను న్యూస్) : ఏపీలో కోవిడ్ సమయంలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు జగన్ సర్కార్ శుభవార్త చెప్పింది. ఆయా ఉద్యోగుల కుటుంబ సభ్యులకు నిబంధనలు సడలించి కారుణ్య నియామకాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఓకే చెప్పింది. తమ విన్నపంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. ఏ డిపార్టుమెంటులో ఖాళీ ఉంటే అందులో కారుణ్య నియామకం కల్పించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఉద్యోగ సంఘాలతో జరిగిన సమావేశంలో జీఏడీ కార్యదర్శి పోలా బాస్కర్ ఈ డిమాండ్‌పై సుదీర్ఘంగా చర్చించామని.. సానుకూలంగా స్పందించారన్నారు.

ఖాళీలు, పాయింట్లు, రోస్టర్లతో ఎటువంటి సంబంధం లేకుండా ఈ నియామకాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రతి ఉద్యోగాన్ని భర్తీ చేయాలని భావిస్తున్నారు. ప్రభుత్వం ఒకటి రెండు రోజుల్లో ఉత్తర్వులను జారీ చేయనుంది.

ముఖ్యమంత్రి జగన్ దగ్గర ఈ విషయాన్ని గతంలోనే ఉద్యోగులు ప్రస్తావించారు. కారుణ్య నియామకం విషయంలో సానుకూలంగా స్పందించారు.

## అంకిత భావంతో విధులు నిర్వహించాలి

### – రాష్ట్ర డిజిపి కెవి.రాజేంద్రనాథ్‌రెడ్డి



అనంతపురం, **(విజయభాను న్యూస్)** : పోలీసు శాఖలో పని చేసే ప్రతి ఒక్కరూ అంకిత భావంతో విధులు నిర్వహించి ప్రజలకు సేవలు అందించాలని రాష్ట్ర డిజిపి కెవి.రాజేంద్ర నాథ్‌రెడ్డి తెలిపారు. అనంతపురంలోని పోలీసు అకాడమీలో శిక్షణ పొందుతున్న ట్రైనీ డిఎస్‌పిలతో గురువారం ముఖాముఖి సమావేశం నిర్వహించారు. సమాజం, వృత్తిపరంగా, వ్యక్తిగతంగా ఎలా వ్యహరించాలి.. ప్రజలకు అందించాల్సిన సేవలు.. విధినిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన

తరువాయి 2లో..

## చిన్నారులపై సాయుధ ఘర్షణల ప్రభావం..

### ఆ నివేదిక నుంచి భారత్ పేరు తొలగింపు



న్యూయార్క్: ఐరాస వేదికపై భారత్‌కు సానుకూల పరిణామం చోటు చేసుకొంది. 'చిన్నారులు– సాయుధ సంఘర్షణలపై ఐరాస సెక్రెటరీ జనరల్ వార్షిక నివేదిక–2023' నుంచి భారత్ పేరును తొలగించారు. చిన్నారుల మెరుగైన రక్షణ కోసం భారత ప్రభుత్వం తీసుకున్న చర్యలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఐరాస సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ తెలిపారు. జమ్మూ–కశ్మీర్‌లోని సాయుధ గ్రూపులు.. బాలలను నియమించుకోవడం, వారిని వినియోగించుకోవడం, మరోవైపు.. దేశ భద్రత పేరిట ఆ చిన్నారులను భద్రత

తరువాయి 2లో..

## ఏపీలో 20 లక్షల దొంగ ఓట్లు గుర్తింపు..

### చంద్రబాబు సమీక్షలో నేతల వెల్లడి



మంగళగిరి, **(విజయభాను న్యూస్)** : రాష్ట్రంలో పెద్ద ఎత్తున దొంగ ఓట్లు ఉన్నాయని తెలుగు దేశం పార్టీ నేతలు ఆరోపించారు. ఓటరు జాబితాలో అక్రమాలకు సంబంధించి చంద్రబాబు గురువారం టీడీపీ నేతలతో సమీక్ష నిర్వహించారు. ఓటరు జాబితాలో అక్రమాలపై నిరంతరం అప్రమత్తంగా ఉండి పోరాటం చేయాలని తెలుగు దేశం అధినేత నారా చంద్రబాబునాయుడు పార్టీ నాయకులకు సూచించారు. రాష్ట్రంలో దొంగ ఓట్ల నమోదు, టీడీపీ అనుకూల ఓట్ల తొలగింపు అంశాలను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నో అక్రమాలకు పాల్పడుతుందని, దాని కోసం ఇప్పటి నుంచే కుట్రలు మొదలు పెట్టిందని ఆరోపించారు. తెలుగు దేశం పార్టీ పరంగా జరుగుతున్న ఓటరు వెరిఫికేషన్ ప్రక్రియపై టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎలక్షన్ కమిటీ సభ్యులతో చంద్రబాబు గురువారం పార్టీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో ఇప్పటి వరకు 20 లక్షల దొంగ ఓట్లు ఉన్నట్లు గుర్తించామని టీడీపీ నేతలు వెల్లడించారు. వీటిపై చర్యలు కోరుతూ అక్రమాలపై సాక్ష్యాధారాలతో సహా వివరాలను ప్రధాన ఎన్నికల అధికారికి అందజేశామని చంద్రబాబుకు నేతలు వివరించారు.

రాష్ట్రంలో చనిపోయిన వారి ఓట్లు తొలగించకపోవడం, దొంగ ఓట్లు నమోదు చేయడం, టీడీపీకి అనుకూలం అని భావించే వారి ఓట్లను తొలగించడం, ఒక

తరువాయి 2లో..

## రాహుల్ గాంధీ కాన్వాయ్ ని అడ్డుకున్న మణిపూర్ పోలీసులు

ఇంఫాల్ : కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ కాన్వాయ్ ని మణిపూర్ పోలీసులు గురువారం అడ్డుకున్నారు. రాష్ట్ర రాజధానికి 20 కి.మీ దూరంలోని బిష్ణుపూర్ చెక్‌పోస్ట్ వద్ద రాహుల్ గాంధీ కాన్వాయ్ ని పోలీసులు నిలిపివేశారని కాంగ్రెస్ సీనియర్ నేత కె.సి. వేణు గోపాల్ పేర్కొన్నారు. భద్రతా కారణాల రీత్యా తమను అనుమతించే పరిస్థితి లేదని పోలీసులు వెల్లడించారని కాంగ్రెస్ సీనియర్ నేత కెసి.వేణుగోపాల్ అన్నారు. రాహుల్ తిరిగి ఇంఫాల్‌కు బయలు దేరారని, రోడ్డు మార్గంలో కుదరనందున హెలికాప్టర్‌లో చురచంద్‌పూర్ చేరుకుంటారని అన్నారు.

భద్రతా కారణాల రీత్యా రోడ్డు మార్గంలో కాకుండా హెలికాప్టర్‌లో వెళ్లాల్సిందిగా పోలీసు అధికారులు సూచించినట్లు తెలిపారు. రాహుల్ గాంధీ రెండు రోజుల పాటు మణిపూర్‌లో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. గురువారం చురచంద్‌పూర్‌లోని సహాయక శిబిరాల్లో తలదాచు కుంటున్న ప్రజలను కలుసుకోనున్నట్లు తెలిపాయి. మణిపూర్‌లో నెలకొన్న హింసాకాండలో తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాల్లో చురచందాపూర్ కూడా ఒకటి.






## ఆర్థిక లావాదేవీల్లో వివాదాల వల్లే దంపతుల కిడ్నాప్

### నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమవర్మ



విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** : విశాఖలో స్థిరాస్తి వ్యాపారి దంపతుల కిడ్నాప్ ఘటనపై నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమవర్మ స్పందించారు. స్థిరాస్తి వ్యాపారం ఆర్థిక లావాదేవీల్లో వివాదాల వల్లే దంపతులను కిడ్నాప్ చేసినట్లు సీపీ వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడకు చెందిన పట్నాల శ్రీనివాస్, లోవ లక్ష్మి దంపతులు నాలుగు నెలల క్రితం విశాఖకు వచ్చి నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంటున్నారు. బుధవారం పట్నాల శ్రీనివాస్ దంపతులను బ్రహ్మయ్య, సాయినిఖిల్, మణికంఠ, ప్రదీప్‌రెడ్డి అనే నలుగురు వ్యక్తులు శ్రీనివాస్ దంపతులను కారులో అపహరించారు. గతంలో శ్రీనివాస్ వీరితో కలిసి ఎంకే కన్‌స్ట్రక్షన్స్ పేరుతో వ్యాపారం చేశాడని సీపీ తెలిపారు. దంపతులను కిడ్నాప్ చేసిన అనంతరం ఎలమంచిలి దగ్గర శ్రీనివాస్ భార్య లక్ష్మిని విడిచిపెట్టడంతో.. ఆమె కత్తిపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నిందితులను పట్టుకున్నామని తెలిపారు. గతంలో శ్రీనివాస్‌పై కంచికచర్ల, నర్సీపట్నం, రాజమండ్రి, విజయవాడలో మోసం కేసులు నమోదయ్యాయని సీపీ వెల్లడించారు.

విశాఖలో గన్ లైసెన్స్‌లపై కూడా సీపీ స్పందించారు. 2020 నుంచి 15 మందే తుపాకీ లైసెన్స్ కోసం దరఖాస్తు చేశారని తెలిపారు. 2020లోనే కలెక్టరేట్ ద్వారా గుడివాడ అమర్‌నాథ్ తుపాకీ లైసెన్స్ కోసం దరఖాస్తు చేశారని తెలిపారు. ఇటీవల కిడ్నాప్‌కు గురైన ఇద్దరూ తుపాకీ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసినట్లు వెల్లడించారు.

# భవన యజమానుల అంగీకారంతోనే విస్తరణ పనులు

## - జోనల్ కమిషనర్ శివప్రసాద్

విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** : సంవత్సరంలో రహదారి విస్తరణ క్రమంలో ప్రజల నుండి అభిప్రాయ సేకరణ చేయడం జరిగిందని 4వ జోన్ కమిషనర్ శివప్రసాద్ గురువారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. మహా విశాఖ నగరపాలక సంస్థ పరిధిలోని ప్రసిద్ధి చెందిన జగదాంబ కూడలి నుండి పాత పోస్ట్ ఆఫీస్ వరకు పూర్ణా మార్కెట్ విశాఖ పోర్టు వెళ్లే మార్గం నిత్యం రద్దీతో ఉన్నందున వాహన చోదకులకు, పాదచారులకు ఇబ్బందులు కలుగుతున్న దృశ్య జివిఎంసి యంత్రాంగం రహదారి విస్తరణ పనులు చేపట్టడం జరిగిందని అందులో భాగంగా 2018వ సంవత్సరంలో ప్రజల అభిప్రాయాన్ని సేకరించి 100 అడుగుల రహదారి నుండి 60 అడుగులకు కుదించడం జరిగిందని, 60 అడుగుల రహదారి విస్తరణ కొరకు సుమారు 200 మంది అనుమతి తెలుపుతూ అంగీకార పత్రం అందజేశారని, ఆ క్రమంలో కొంతమంది స్థల యజమానులకు నష్టపరిహారం, టీడీఆర్ లను ఇదివరకే జారీ చేశామన్నారు. ప్రస్తుతం సుమారు 2.4 కిలోమీటర్ల రహదారి విస్తరణ జరుగుతుందని దీనికి రోడ్ డెవలప్మెంట్ ప్లాన్ మంజూరు అయిందని, అందు సుమారు 442 ఆస్తులు రహదారి విస్తరణలో ఉన్నాయన్నారు. ఇందులో 26 భవనాలు రోడ్డు విస్తరణకు ఆటంకం కలగలేదని, 40 భవన యజమానులు గతంలో అనుమతి తెలిపి ఉన్నారని, 2018లో సుమారు 22 టిడిఆర్ లు జారీ చేశామన్నారు. 3 టిడిఆర్ లు ప్రస్తుతం జారీ చేశామని, 77 టిడిఆర్ లు కమిషనర్ అనుమతి పొందాయని తెలిపారు. జివిఎంసి, దేవాదాయ శాఖ దుకాణాలు తొలగింపు పక్రియ జరుగుతుందన్నారు. అలాగే రోడ్డు రికార్డులు పరంగా 60 అడుగుల రోడ్డును ఆక్రమణ, జివిఎంసి ఇదివరకే టిడిఆర్ లు ఇచ్చిన భవనాలను శాఖపరంగా తొలగించడం జరిగిందన్నారు. రహదారి విస్తరణకు సహకరించిన పేకేటి నారాయణరావు, పేకేటి కామేశ్వరరావు టిడిఆర్ బాండ్లను కమిషనర్ ఆమోదించినందున జోనల్ కమిషనర్ వారిచే స్థల యజమానులకు అందించడం జరిగిందన్నారు.

# నగరంలో మరిన్ని బస్సు స్టాప్ లు ఆధునికరణ

## జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ



విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** : నగరంలో మరిన్ని బస్సు స్టాప్ లు ఆధునీకరణ చేపడుతున్నట్లు జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ తెలిపారు. గురువారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 3, 4వ జోన్ పరిధిలోని దత్తయిలాండ్, ద్రోణంరాజు సర్కిల్, జగదాంబ జంక్షన్, బీచ్ రోడ్ లోని స్విమ్మింగ్ పూల్, వాల్తేరు లోని లాస్యన్స్ బే పార్క్ తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సుమారు రూ.4.62 కోట్లతో జివిఎంసి పరిధిలో 20 బస్ స్టాప్ లను ఆధునికరించడం జరుగుతుందన్నారు. జగదాంబ జంక్షన్ ఆధునీకరణతో పాటు బస్టాప్ ను కూడా ఆధునికరించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ద్రాణంరాజు సర్కిల్, దత్తయిలాండ్ లో జంక్షన్ ల ఆధునీకరణకు చర్యలు చేపట్టామన్నారు. ఆర్కే బీచ్ ఆక్వా స్పోర్ట్స్ స్విమ్మింగ్ పూల్ పనులు పరిశీలించి అధికారులకు కొన్ని సూచనలు చేస్తూ పనులు త్వరతిగన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలన్నారు. అనంతరం లాస్యన్స్ బే పార్కును పరిశీలించి ఇకో-వైజాగ్ లో భాగంగా పాడైన వస్తువులు వ్యర్థాలతో రీసైక్లింగ్ పద్ధతిలో పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులను ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేశారు. ఈ పర్యటనలో డిడిహెచ్ దామోదర్ రావు, పర్యవేక్షక ఇంజనీర్లు వినయ్ కుమార్, వేణుగోపాల్, రాజు, కార్యనిర్వాహక ఇంజనీర్లు దిలీప్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఛార్జీల భారాన్ని వెంటనే రద్దు చేయాలి

విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** : ప్రజలపై భారీగా వేసిన విద్యుత్ ఛార్జీల భారాన్ని వెంటనే రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, కేంద్ర బిజెపి,రాష్ట్ర వైసిపి ప్రభుత్వాలు విద్యుత్‌ను ప్రయివేటీ కరించే కుట్రలను విడనాడాలని, ఆదానీ తదితర కార్పొరేట్ల ప్రయోజనాల కోసం సామాన్య, మధ్యతరగతి ప్రజలను, రైతులను, రాష్ట్ర ప్రయోజనాలను బలిపెట్టడం ఆపాలని వామపక్ష పార్టీలు ఈనెల 30న రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సబ్‌స్టేషన్లు కార్యాలయాలు వద్ద ధర్నాలకు పిలుపునిచ్చాయి.

దీనిలో భాగంగా విశాఖజిల్లాలో ఈనెల 30 ఉ? 10గం?ల నుండి భీమిలి, పెందుర్తి, గాజువాక, ప్రాంతాలతోపాటు నగరంలోని ఎపిఇపిడిసిఎల్ సిఎండి కార్యాలయం వద్ద ధర్నాలు జరుగుతాయి. ఈకార్యక్రమంలో విశాఖ ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ, ఎంసిపిఐ జిల్లా కమిటీలు తరుపున విజ్ఞప్తి చేస్తున్నాము.

# తొమ్మిదేండ్లలో చూసింది ట్రైలరే..

## అసలు సినిమా ముందుంది..

## తెలంగాణ ప్రగతిపై మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు



హైదరాబాద్ : తొమ్మిదేండ్లలో మీరు చూసింది ట్రైలరే అని.. అసలు సినిమా ముందు ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ జర్నీ ఇప్పుడే మొదలైందని.. కేసీఆర్ మనసులో ఇంకా చాలా ప్రణాళికలు ఉన్నాయని ఆయన తెలిపారు. నానక్‌రామ్‌గూడలో క్రెడాయి కార్యాలయాన్ని మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జానపద గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సాయిచంద్ మరణం పట్ల నివాళులర్పించారు. అనంతరం మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 95 నుంచి 100 స్థానాల్లో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మాటలు చెప్పడం ఈజీనే కానీ.. తొమ్మిదేండ్లలో ఎక్కడ ఉన్న తెలంగాణ ఎక్కడికి వచ్చిందో ఆత్మవలోకనం చేసుకోవాలని మంత్రి కేటీఆర్ ప్రజలకు సూచించారు. మాటలు చెబుతున్న ఓ ప్రతిపక్ష పార్టీయేమో 50 ఏండ్లు అధికారం చలాయించినవాళ్లేనని.. ఇంకో ప్రతిపక్షమేమో ఢిల్లీలో 9 ఏండ్లుగా పాలిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. వాళ్ల మాటలేమో కోటలు దాటుతాయి కానీ కాళ్లు మాత్రం కడప దాటడం లేదని ఎద్దేవా చేశారు. కరెంట్ సమస్య పరిష్కారం అలకటి పని అయితే 50, 60 ఏండ్లుగా ఎందుకు పరిష్కారం కాలేదని ప్రశ్నించారు. తాగునీటి, సాగునీటి సమస్యలు అలకటి పనే అయితే ఎందుకు పరిష్కారం కాలేదని అడిగారు. 60 ఏండ్లలో కాని పనులు తొమ్మిదేండ్లలో పూర్తికావడానికి సమర్థవంతమైన కేసీఆర్ నాయకత్వం, సుస్థిరమైన ప్రభుత్వమే కారణమని స్పష్టం చేశారు. 'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో చాలామంది చాలా అనుమానాలు వ్యక్తం చేశారు. తెలంగాణ వచ్చిన కొత్తలో జరిగిన ఎన్నికల్లో 63 సీట్లే వచ్చాయి. ఒక్క 10 మందిని అటు ఇటు చేస్తే వెంటనే ప్రభుత్వం ఆగమైతది.. తెలంగాణ ఫెయిల్డ్ ఎక్సపర్మెంట్ అవుతదని తెలంగాణ వ్యతిరేకులు చాలా ప్రయత్నాలు చేశారు.' అని గుర్తు చేశారు. 'కొంతమంది రాజకీయ నాయకులకు క్లారిటీ ఉండకపోవచ్చు.. కానీ ప్రజలకు క్లారిటీ ఉంటుంది. జేబులో 100 నోటు ఉంటే.. దాని కింద పడేసి.. రోడ్డు మీద చిల్లర నాణేలు ఎవరూ ఏరుకోరు. అలాగే మంచిగ పనిచేసే ప్రభుత్వాన్ని పిచ్చోళ్లు కూడా వదులుకోరు. కాబట్టే మొదటి ఎన్నికల్లో 63 సీట్లతో గెలిస్తే.. 2018 ఎన్నికల్లో 88 సీట్లతో గెలిచాం. 2023లో జరిగే ఎన్నికల్లో 95 నుంచి 100 స్థానాల్లో గెలుస్తామని సంపూర్ణ విశ్వాసం ఉంది.' అని ధీమా వ్యక్తం చేశారు.

# జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

## అర్హత ఉండి పథకం అందని లబ్దిదారులు ఉండకూడదు

## జగనన్న సురక్ష టెలీకాన్ఫరెన్స్ లో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

శ్రీకాకుళం, : అర్హత ఉండి పథకం అందని లబ్దిదారులు ఉండకూడదు, జులై ఒకటో తేదీన చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా పండుగ వాతావరణం లో పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ జగనన్న సురక్ష కార్యక్రమనిర్వహణ పై గురువారం ఉదయం గ్రామ వార్డు సచివాలయ నోడల్ అధికారి, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, ఉప తహసీల్దార్లు, విస్తరణ అధికారి పంచాయతీ మరియు రూరల్ డెవలప్మెంట్, పంచాయతీ సెక్రెటరీస్, గ్రామ రెవిన్యూ అధికారులు, డిజిటల్ సహాయకులుతో టెలీ కాన్ఫరెన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటికీ వెళ్లి సర్వే చేయాలని, వారికి పథకాలు అందుతున్నదీ లేనిదీ తెలుసుకోవాలని, వారికి కావాల్సిన 11 రకాల సేవలపై ఆరా తీయాలని సచివాలయ సిబ్బందిని, వలంటీర్లను సూచించారు. అర్హత ఉండి ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకం లబ్ధి పొందకుండా ఉండకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టారన్నారు. జులై ఒకటో తేదీన మొదలవుతున్న ఈ కార్యక్రమం లో భాగంగా షెడ్యూల్ ప్రకారం ఎంపిక చేసిన గ్రామాలు వార్డులలో ఏర్పాటుచేస్తున్న శిబిరాల్లో తగినన్ని ప్రింటర్లు, లాప్టాప్, డెస్కాప్, స్కానర్లు, స్టేషనరీ, హెూలో గ్రాముల వంటి మౌలిక సదుపాయాలు సజావుగా ఉండేటట్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే శిబిరానికి ఎక్కువమంది ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున వారికోసం మంచినీరు, స్నాక్స్, నీడ వంటి



సౌకర్యాలను కల్పించడంతోపాటు వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేయాలన్నారు. శిబిరాల నిర్వహించే తేదీలు ప్రదేశాలు ముందుగా ప్రజలకు తెలియపరచాలన్నారు. సంబంధిత సెక్రటేరియట్‌లలో క్యాంపు షెడ్యూల్ తేదీకి 7 రోజుల ముందు కార్యకలాపాలు & అవగాహన ప్రచారాన్ని నిర్ధారించుకోవాలని తెలిపారు. శిబిరం రోజున సంబంధిత సచివాలయాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు ఉండేలా చూడాలన్నారు. శిబిరానికి వచ్చే ప్రజలకు కావలసిన వివిధ రకాల సేవలకు సంబంధించిన వివరాలను తెలియజేసి వారికి ప్రభుత్వ పథకం లబ్ధి చేకూరే విధంగా వారికి కావలసిన ధ్రువీకరణ పత్రాలను పొందేందుకు అన్ని విధాల సహాయ సహకారాలు తప్పనిసరిగా అందించాలన్నారు. గ్రామ వార్డు సచివాలయ కార్యదర్శులు వాలంటీర్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంసిద్ధం కావాలన్నారు.

# గ్రూప్-4 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

కరీంనగర్, : జులై 1న జిల్లాలో గ్రూప్-4 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పాలనాధికారి ఆర్‌వీ.కర్ణన్ సూచించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో లైజనింగ్ అధికారులు, చీఫ్ సూపరిం టెండెంట్లు, సంబం ధిత ఇతర అధికారులకు పరీక్ష ఏర్పాట్లపై ఆయనతో పాటు సీపీ సుబ్బారాయుడు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 54019 మంది అభ్యర్థుల కోసం 154 కేంద్రాలను గుర్తించి సిబ్బందిని నియమించామన్నారు. కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఉండాలని, ప్రశ్నపత్రం తెరిచే ముందు వీడియో రికార్డు చేయించి టీఎస్‌పీఎస్సీకి పంపించా లన్నారు. సీపీ మాట్లాడుతూ పరీక్ష మొదలైన తర్వాత ముగిసే వరకు కేంద్రం నుంచి ఎవరినీ బయటకు పంపకూడదని, ఏదైనా అత్యవసర ఆరోగ్య సమస్యలు తలెత్తితే మెడికల్ అధికారి ఆధ్వర్యంలో అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి పంపించాలన్నారు.

# ఏపీలో 20 లక్షల దొంగ ఓట్లు గుర్తింపు..

బూత్‌లో ఓట్లను మరో బూత్‌కు బదలాయించడం వంటి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని తాము ఎన్నికల సంఘాన్ని కోరామని చంద్రబాబుకు టీడీపీ నేతలు చెప్పారు. అధికార వైసీపీ దొంగ ఓట్లతో అక్రమాలకు పాల్పడుతూ.. ఆ బురదను తిరిగి టీడీపీకి అంటించే ప్రయత్నాలను గట్టిగా ఎండగట్టాలని చంద్రబాబు ఆదేశించారు. పార్టీ చేపట్టే కార్యక్రమాల్లో ఓటరు వెరిఫికేషన్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందులో ప్రజలను కూడా భాగస్వాములను చేయడం ద్వారా వైసీపీ అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. అనర్హులకు ఓట్ల విషయంలో ఉద్దేశపూర్వకంగా తప్పులు చేసే ఏ అధికారినీ వదిలేది లేదని చంద్రబాబు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# అంకిత భావంతో విధులు నిర్వహించాలి

మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావం, పారదర్శకత, క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని అన్నారు. ఇటీవల పెరిగిపోతున్న సైబర్ నేరాల కట్టడికి కృషి చేయాలని తెలిపారు. మహిళల రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం, పోలీసుశాఖలు కృషి చేస్తున్నాయని, ఆ దిశగా మహిళల రక్షణ కవచంగా దిశ యాప్ పని చేస్తోందని చెప్పారు. గంజాయి, తదితర మాదక ద్రవ్యాల నియంత్రణపై ఇప్పటికే పోలీసు శాఖ ఉక్కుపాదం మోపిందన్నారు. మత్తుపదార్థాల అనర్థాలపైనా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలకు సత్వర న్యాయం జరగడమే ధ్యేయంగా పోలీసులు విధులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఐజిపి వెంకట్రామిరెడ్డి, ఎస్పి కె.శ్రీనివాసరావుతో పాటు ట్రైనీ డిఎస్పిలు పాల్గొన్నారు.


# చిన్నారులపై సాయుధ ఘర్షణల ప్రభావం..

బలగాలు అదుపులోకి తీసుకోవడం వంటి ఆరోపణలపై భారత్ పేరును ఈ నివేదికలో ప్రస్తావిస్తూ వచ్చారు. బుర్కినా ఫాసో, కామెరూన్, లేక్ చాద్ బేసిన్, నైజీరియా, పాకిస్థాన్, ఫిలిప్పీన్స్ తదితర దేశాలతోపాటు భారత్ పేరును కూడా 2010 నుంచి ఈ జాబితాలో ఉంచారు. దీంతో ఈ నివేదిక నుంచి బయటపడేలా మహిళాశిశు సంక్షేమ శాఖ చర్యలు తీసుకుంది.

ఈ క్రమంలోనే చిన్నారుల రక్షణ కోసం కేంద్రం ఏర్పాటు చేసిన చట్ట, పరిపాలనపరమైన కార్యక్రమాలను ఐరాస చీఫ్ తన తాజా నివేదికలో స్వాగతించారు. ఛత్తీస్‌గఢ్, అస్సాం, ఝార్ఖండ్, ఒడిశా, జమ్మూ- కశ్మీర్‌లలో చిన్నారుల హక్కులను కాపాడటంతోపాటు 'బాలల హక్కుల పరిరక్షణ కోసం జమ్మూ- కశ్మీర్ కమిషన్ ఏర్పాటు'లో పురోగతి సాధించినట్లు గుర్తించారు. దీంతో నివేదిక నుంచి భారత్ పేరును మినహాయించారు. పిల్లలపై బలప్రయోగాన్ని నిషేధించడం వంటి చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# 'ప్రకాశించని నవరత్నాలు.. జగన్ మోసపు లీలలు'

## వాస్తవ పత్రం విడుదల చేసిన తెదేపా




మంగళగిరి, **(విజయభాను న్యూస్)** : వైకాపా మేనిఫెస్టోలో 99 శాతం హామీలు అమలు చేశారనడం అవాస్తవమని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విమర్శించారు.'ప్రకాశించని నవరత్నాలు.. జగన్ మోసపు లీలలు' పేరిట తెదేపా రూపొందించిన వాస్తవ పత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అచ్చెన్న మాట్లాడారు. జగన్ చెప్పేవన్నీ అసత్యాలేనని.. ఒక్కటీ నిజం ఉండదని ఆరోపించారు. ఎన్నికల ముందు ఒకటి చెప్పి.. అధికారంలోకి వచ్చాక మరొకటి చేస్తున్నారని విమర్శించారు. అమ్మఒడి కింద రూ.15వేలు ఇస్తామని చెప్పి.. రూ.13వేలు ఇస్తారా అని ఆయన నిలదీశారు. రాష్ట్రంలో 84 లక్షల మంది ఉంటే 42 లక్షల మందికే పథకాన్ని వర్తింపజేయటం ఏంటని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. తెదేపా అధికారంలోకి వచ్చాక 'తల్లికి వందనం' కార్యక్రమం తీసుకొచ్చి.. ప్రతి మహిళకు రూ.15వేలు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. గతంలో పింఛన్ రూ.200 ఉంటే రూ.1800 పెంచి రూ.2 వేలు ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా మందుల కొరత లేకుండా చేశామని చెప్పారు. గత నాలుగేళ్ల వైకాపా పాలనలో పేదవాడికి సరైన వైద్యం అందుతోందా? అని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు.

"మేం 74 లక్షల మందికి పింఛన్ ఇస్తే.. మీరు 62 లక్షల మందికే ఇస్తారా? వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత 10 లక్షల మందికి పింఛన్లు తొలగించడం వాస్తవం కాదా?ఏవేవో సాకులతో పేదవాడి పథకాలన్నీ తీసేసి మోసం చేస్తున్నారు. తప్పుడు ప్రచారాలతో ప్రజలను సీఎం జగన్ మోసం చేస్తున్నారు. రైతు భరోసా కింద 12 హామీలిచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద 8 హామీల్లో ఒక్కటీ అమలు కాలేదు. పింఛన్ల పెంపు కింద ఇచ్చిన 3 హామీల్లో 2 అమలు కాలేదు. అమ్మఒడి కింద ఇచ్చిన 2 హామీలు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. పేదలందరికీ ఇళ్లు పేరిట ఇచ్చిన 5 హామీలూ అమలు కాలేదు. బోధనారుసుం కింద ఇచ్చిన 2 హామీల్లో ఒక్కటీ అమలు కాలేదు. వైఎస్సార్ జలయజ్ఞం కింద ఇచ్చిన హామీలన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. మద్య నిషేధమంటూ ఇచ్చిన హామీ కూడా ఇంతవరకు అమలు చేయలేదు" అని అచ్చెన్న ఆరోపించారు.

# రోడ్డుపక్కన అపస్మారక స్థితిలో శేజల్.. బ్యాగ్‌లో లేఖ లభ్యం

హైదరాబాద్, : ఆరిజిన్ డెయిరీ సీఈవో బోడపాటి శేజల్ మరోసారి ఆత్మహత్యా ప్రయత్నం చేశారు. జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మగుడి సమీపంలో రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు ఆమెను ఆటోలో ఆసుపత్రికి తరలించారు. శేజల్ బ్యాగ్‌లో నిద్రమాత్రలు, లేఖను గుర్తించారు. మధ్యాహ్నం ఒకటిన్నర సమయంలో ఆమెను పెద్దమ్మగుడి వద్ద ఎవరో డ్రాప్ చేశారని స్థానికులు చెబుతున్నారు. శేజల్ గత కొంతకాలంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. తనను లైంగికంగా వేధించిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని ఇటీవల దిల్లీలో జాతీయ మహిళా కమిషన్, హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేశారు. ఆతర్వాత తెలంగాణ భవన్ వద్ద ఆమె ఆత్మహత్యకు యత్నించారు. ప్రస్తుతం శేజల్ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించినట్టు పోలీసులు భావిస్తున్నారు. "లైంగికంగా వేధించిన దుర్గం చిన్నయ్యపై చర్యలు తీసుకోవాలి. దిల్లీలో అధికార పార్టీ ఎంపీని కలిస్తే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడేమో చిన్నయ్య వేధింపులపై ఆధారాలు లేవని ఎంపీ అంటున్నారు. న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదు. ఎప్పుడు చంపుతారోననే భయంతో బతుకుతున్నా. పెద్దమ్మగుడి వద్ద ప్రశాంతత లభిస్తుందని భావిస్తున్నా" అని శేజల్ లేఖలో పేర్కొన్నారు.

# ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన

## 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు



అక్కయ్యపాలెం (విజయభాను న్యూస్) : విశాఖ దక్షిణ నియోజకవర్గం 35వ వార్డు పరిధిలో కీర్తిశేషులు పూజలు రాజేశ్వరరావు మెమో రియల్ ఫుట్ బాల్ టోర్నమెంట్స్‌లో 16 ప్రధాన జట్లు తలపడడంతో సుమారుగా ఐదు రోజులు జరిగే ఈ మ్యాచ్‌లను ప్రారంభం చేయడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ దక్షిణ నియోజకవర్గ 35 వ వార్డు వైఎస్ఆర్సిపి కార్పొరేటర్ విల్లూరు భాస్కరరావు విచ్చేసి ఆయన చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది తలపడిన టీంలు ఏయూ స్టాప్ విశాఖ బీచ్ ఫుట్ బాల్ శ్రీ దుర్గాలమ్మ సభరి కూడా ఈ కార్యక్రమం అసోసియేషన్ సభ్యులు పెద్దలు జాలరి పేట ఫుట్‌బాల్ టీం సభ్యులు కండక్ట్ చేయడం జరిగినది.

# నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ



భీమునిపట్నం : విజయబాను న్యూస్ చిట్టివలస, హైస్కూల్ 91 92 టెన్త్ క్లాస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమం సపు భవాని ప్రసాద్ కుమార్తె కుందన శ్రీ పుట్టినరోజు సందర్భంగా కొత్తపేట అలంక వీధిలో గల నిరుపేద కుటుంబానికి భవాని ప్రసాద్ వారి ఆర్థిక సహాయంతో నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో వర్మ, హేమ, గోవాడ సురేష్, సుబ్బారావు, పిట్ట రఘు శ్రీనివాస్ రెడ్డి, కంబపు శీను, పాల్గొన్నారు.

# బేతవోలుకు పురస్కారం పట్ల రంగనాథం హర్షం

రాజాం (విజయభాను న్యూస్) : ప్రముఖ సంస్కృతాంధ్ర పండితుడు, కవి, రచయిత బేతవోలు రామబ్రహ్మం కు సాహిత్య అకాడమీ రెండేళ్లకు ఒకసారి ఇచ్చే భాషా సమ్మాన్ పురస్కారం ఇవ్వడం పట్ల రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం గురువారం హర్షం ప్రకటించారు. రామబ్రహ్మం కవిత్వం,ప్రబంధం, నాటకాలు, అనువాదాలు ఇలా 34పుస్తకాలకు పైగా రచించారని రంగనాథం తెలియ జేశారు. తాను రచించిన రాయరత్న మంజుష కు, సూక్తిరత్న మంజరికి కూడా రామబ్రహ్మం ముందుమాటలు అందించారని, ప్రాచీన సాహిత్య రచనలో తనకు తగు సూచనలు ఇస్తుంటారని అన్నారు. ఈ పురస్కారంలో భాగంగా లక్ష రూపాయల నగదు, తామ్ర పత్రము అంది స్తారని చెప్పారు. దేశంలోనే ఈ విధంగా ఈ సంవత్సరం తెలుగు భాషను గుర్తించి, గౌరవించినందుకు రంగనాథం తన ఆనందాతిరేకాలను ప్రకటించారు.



రామబ్రహ్మంతో గార రంగనాథం

## శ్రీ భార్గవి అమ్మోనియా కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ సేవలు అభినందనీయం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నారాయణరావు



పరవాడ (విజయభాను న్యూస్) : భార్గవి అమ్మోనియా కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సేవలు అభినందనీయమని పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జీ.వి.నారాయణ రావు అన్నారు. .ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ భార్గవి అమోనియా కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరవాడ వారిచే నిర్మించి ఇవ్వబడిన ఆర్వో డ్రింకింగ్ ప్యూరిఫై వాటర్ ప్లాంట్ ను ప్రారంభించడం జరిగింది.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్థ అధినేత మరియు పరవాడ ఇండస్ట్రీస్ సర్వీస్ సొసైటీ అసోసియేషన్ చైర్మన్ గుత్తికొండ మోహన్ రావు హాజరై ఆయన చేతుల మీదుగా ఆర్ ఓ ప్లాట్ ను ప్రారంభించారు.. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జీవి నారాయణరావు మాట్లాడుతూ శ్రీ భార్గవి అమ్మోనియా కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సేవలు అభినందనీయమని కొనియాడారు.. పేదవిద్యార్థులకు మౌలిక వసతులు కల్పనకు పారిశ్రామిక వేత్తలు, సామాజిక కార్యకర్తలు సాయం అందించాలన్నారు..తాను కూడా విద్యార్థిని, విద్యార్థులకు అన్ని విధాల సహకారం అందిస్తానని పేర్కొన్నారు.. సంస్థ అధినేతలకు కృతజ్ఞతలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో లాలంకోడూరు ప్రిన్సిపల్ ఎంవిఎస్ నాయుడు, విశ్రాంతి ఫిజిక్స్ అధ్యాపకులు రంగనాయకులు, పరవాడ ఇండస్ట్రీస్ సర్వీస్ సొసైటీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆనంద్ అప్పారావు, కిషోర్, రాజశేఖర్ మరియు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు..

# శ్రీ జగన్నాథ స్వామి ఆలయంలో

## శ్రీ వైకుంఠ నారాయణం శయన ఏకాదశి పూజలు

భీమునిపట్నం (విజయభాను న్యూస్) : స్థానిక శ్రీ జగన్నాథ స్వామి ఆలయంలో గురువారం శ్రీ వైకుంఠ నారాయణం శయన ఏకాదశి పూజలు ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల సింగరాచార్యులు ఘనంగా నిర్వహిచారు. ఈ సందర్భంగా బలరామ సుభద్ర సహిత శ్రీ జగన్నాథ స్వామికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహిం చారు. అనంతరం శ్రీ జగన్నాథ స్వామి వారి మారు రధాయాత్ర భీమిలి పురవీధులు చిన్న బజార్ మెయిన్ రోడ్ లలో నిర్వహించారు. ఈ రధాయాత్ర లో ఆలయ అర్చకులు అర్ ప్రసాద్ ,కృష్ణామా చార్యులు, భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇన్క్రెడిబుల్స్ ప్లే స్కూల్ ప్రారంభం

భీమునిపట్నం : విజయభాను న్యూస్ : తగరపువలస రాములమ్మ థియేటర్ దగ్గర సాయి రవీంద్ర స్కూల్ వారి నూతన బ్రాంచ్ ఇన్క్రెడిబుల్స్ ప్లే స్కూల్ ఎ.సి క్యాంపస్ ను గురువారం సన్ స్కూల్ కరెస్పాండెండ్ కె.శ్రీనివాసరావు ,స్టేట్ అపస్మా ట్రెజరీ ఎం.వి.రావు రావు, స్థానిక పెద్దలు రంగురి రాంబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ భోగేల క్రిష్ణ, వాంద్రసి సతీష్,స్థానిక నాయకులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

# వైసీపీ అధ్యక్షులు 'కోన' సారూ నేను చేసిన తప్పేంటి


- నా మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రచారం చేస్తే సహించేది లేదు
- పరవాడ వైసీపీ సీనియర్ నాయకులు పైల హరీష్
- అసత్యా కథనాలకు వివరణ ఇవ్వాలని కోరుతూ'కోన'కి వినతి



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండల వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పైల హరీష్ అనే నేను విన్నవించుకునేది ఏమి అనగా నా పై నిన్న అనగా ఈనెల 28 వ తేదీని అసత్యా ప్రచారాలతో కూడిన కొన్ని కథనాలతో నా పై నిందలు మోపుతూ మీరు మరియు పెందుర్తి మరియుపరవాడ పార్టీ కార్యాలయం ఆఫీస్ బాయ్స్ నుండి వాట్స్ప్ గ్రూప్ లో నా పై పార్టీ సస్పండ్ చేసిందని కథనాలు ప్రచారం చేశారు. మండల పార్టీ అధ్యక్షులు గా మీ పై ఎన్నో బాధ్యతలు ఉన్నాయన్నారు.. మీరు పార్టీ కార్యకర్తలను కాపాడాల్సిన బాధ్యత గల వ్యక్తిగా ఉండి కూడా మీరు ఎవరో ఒక వ్యక్తి పంపించిన కథనాన్ని నిజానిజాలు తెలుసుకోకుండా వివిధ మాధ్యమాలలో పెట్టడం నా యొక్క మనోభావలు దెబ్బ తీసే విధంగా మీరు వ్యవహరించటం సరి కాదు అన్నారు... ఇప్పిటకైన మీరు నిజనిజాలు తెలుసుకొని పత్రిక మిత్రులకు మండల పార్టీ నాయకలకు కార్యకర్తలకు మా పై వచ్చిన కథనాలు కు సాక్ష్యలతో కూడిన వివరణ ఇచ్చి మీ హుందాతనాన్ని కాపాడుకోవాలని కోరారు..

# హిందీ పరీక్షల ఫీజుకు

## గడువు జూలై 15



కె.మధుసూధనరావు

రాజాం (విజయభాను న్యూస్) : దక్షిణ భారత హిందీ ప్రచార సభ (చెన్నై) వారి హిందీ పరీక్షల ఫీజు చెల్లించేందుకు జూలై 15 వ తేదీ వరకు గడువు ఉందని హిందీ ప్రచారక్ కె మధు సూధనరావు గురువారం తెలిపారు. పరిచయ్, ప్రాథమిక,మధ్యమ, రాష్ట్రభాష,ప్రవేశిక, విశారద, ప్రవీణ వరకు గల ఈ పరీక్షలు సెప్టెంబర్ నెలలో జరగనున్నాయని అన్నారు. మిగతా వివరాలకోసం 99499 17365 నంబర్ కి సంప్రదించాలని తెలిపారు.

# ఉచిత మహిళా ఆరోగ్య శిబిరం

భీమునిపట్నం, విజయభాను న్యూస్ : కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్,వికాస్ తరంగిణి,మహిళా ఆరోగ్య వికాస్ ఆధ్వర్యంలో స్థానిక చిన్న బజార్ లో ఉన్న కలిగొట్ల ఫౌండేషన్ లో జూలై 1 న ఉచిత మహిళా ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ తెలిపారు. జులై 1 ఉదయం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం1 వరకు నిర్వహించు ఈ కార్యక్రమంలో మహిళలకు మహిళా డాక్టర్స్ చే సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు,సర్వైకల్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు,రొమ్ము క్యాన్సర్ పరీక్షలునిర్వహించనున్నట్లు చెప్పారు. అంతేకాకుండా ఈ వ్యాధులు పై తగు సలహాలు,సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు.మహిళలు ఈ అవకాశంను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# పిలకా దేవేశ్వరి మృతికి ఆడారి ఆనంద్ సంతాపం



ములగాడ (విజయభాను న్యూస్) : వైకాపా సీనియర్ నేత, 63వ వార్డ్ వైకాపా ఇంచార్జ్ పీలకా రామ్ మోహన్ రెడ్డి సతీమణి పిలకా దేవేశ్వరి తీర్థ యాత్రలకు వెళ్లి అరుణాచలం దేవస్థానం దర్శించుకొని తిరిగి ప్రయాణంలో బుధ వారం ఆకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న పశ్చిమ వైకాపా సమన్వయకర్త, విశాఖ డైరీ చైర్మన్ ఆడారీ ఆనంద్ కుమార్ వారి యొక్క స్వగ్రామం మల్కాపురం చేరుకొని ఆ కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసారు. ఆమె మరణం ఆ కుటుంబానికి తీరని లోటని, ఇలా జరగటం చాలా బాధాక రమైన విషయమన్నారు. వారి మృతికి చింతిపస్తూ వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతడ్ని వేడుకుంటూ వారి మృతికి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ రామ్ మోహన్ రెడ్డికి ధైర్యం చెప్పి ఓదార్చారు. సంతాపం తెలిపిన వారిలో గాజువాక వైకాపా ఇంచార్జ్ తిప్పల దేవన్ రెడ్డి, డిప్యూటీ మేయర్ శ్రీధర్, కలిదిండి బద్రీ, కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరావు, భల్లా లక్ష్మణరావు, వైకాపా నాయకులు పూర్రి సురేష్, మహిళా నేతలు, కార్యకర్తలు, తెదేపా నాయకుడు పులి రమణారెడ్డి తదితర ప్రముఖులు ఉన్నారు.

# బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ పేదల దినోత్సవం కార్యక్రమం

భీమునిపట్నం : విజయభాను న్యూస్ మనిషి రోజుకు 2,250 కేలరీల ఆహారాన్ని తీసుకోలేని వారిని పేదలుగా ప్రభుత్వం గుర్తించిందని భీమిలి డైట్ అధ్యాపకులు సారిపల్లి త్రినాథరావు అన్నారు. అంతర్జాతీయ పేదల దినోత్సవం సందర్భంగా తగరపువలస బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ను సంద ర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైతే రోజుకు 2,250 కేల రీల ఆహారం తీసుకోరో అలాంటి వారిని ప్రభుత్వం పేదలు గా గుర్తించినట్లు తెలిపారు. టీచింగ్ డైరీ ఎలా రాయాలో ఉదహరించారు. ప్రధానోపాధ్యాయులు రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ కామన్వెల్త్ కామన్ హంగర్ అనే సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా సరైన తిండి, పౌష్టికాహారం లభించని కారణంగా బరువు తక్కువగా పుడుతున్న పిల్లల్లో అత్యధిక శాతం భారత్‌లోనే ఉన్నట్లు తేలిందని అన్నారు. అనంతరం డైట్ అధ్యాపకులు విద్యార్థులు, చాత్రోపాధ్యాయులు తయారుచేసిన బోధనాభ్యసన సామాగ్రిని పరిశీలించి బాగా తయారు చేసిన వారికి బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో జె. శంకర్, ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, కీర్తి, శ్రావణి, సోనియా తదితరులు పాల్గొన్నారు.

# 85వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

## ముఖ్య అతిథిగా పాల్గొన్న పెందుర్తి శాసనసభ్యులు అన్నం రెడ్డి



పరవాడ (విజయభాను న్యూస్) : వైసీపీ తోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే అదీప్ రాజ్ పేర్కొన్నారు.. గురువారం 85వ వార్డు గంగిరెడ్ల కాలనీలో గడపగడపకు కార్యక్రమంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

ప్రతి ఇంటి ఇంటికి ఆయన వెళ్లి సంక్షేమ పథకాల గురించి చర్చించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, 79 వ వార్డు ఇంచార్జీ అప్పికొండ మహాలక్ష్మి నాయుడు, కింతాడ ఈశ్వం ˉ రావు, సుందారపు అప్పారావు, ప్రకాష్,కర్రీ నర్సింగ్ రావు,గొన్న హేమ చంద్ర, పూర్ణానంద శర్మ, మకిరెడ్డి శ్రీను,చిన్న రావు, పుత్తరయ్య,సేనాపతి శ్రీను, కాత నూకేష్, ఏలమర్తి వెంకటరావు, నియోజక వర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ కిషోర్, జీవీఎంసీ అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

# సత్యన్నారాయణకు ఎమ్మెల్యే పరామర్శ



సత్యన్నారాయణను పరామర్శిస్తున్న ఎమ్ఎల్ఏ కంబాల జోగులు

రాజాం(విజయభాను న్యూస్) : ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సాకేటి సత్యన్నారాయణను రాజాం ఎమ్ఎల్ఏ కంబాల జోగులు గురువారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆయన వైద్యం చేయించుకుని చికిత్స పొందుతున్నారు. ఆయన్ని కలసి ఎమ్ఎల్ఏ ఆరోగ్య యోగా క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాస రావు, కార్యదర్శి శాసపు వేణు గోపాలనాయుడు, పిట్టా జగదీష్ తదితరులు ఉన్నారు.

## శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి

భీమునిపట్నం, విజయభాను న్యూస్ : స్థానిక కృష్ణా కోలని లో ఉన్న శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా లక్ష తులసి పూజ కార్యక్రమం జి. అప్పలచారి ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమం లో కె. రామక్రిష్ణ, విజయలక్ష్మి దంపతులు జి. అప్పలనాయుడు, అర్. పెద్దబాబు, ఎం. సత్యానందం చందు కె. ముత్యాల రావు, కే. సన్నిబాబు, జి. సన్యాసిరావు,జి. ఆనంద్, ఎం. కుమార్, . శ్రీను, బి.భాలాజీ, మణికంట. నాగరాజు. జి. సన్యాసి నాయుడు, ఎస్, కొండబాబు, కే. అరవింద్ పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## చంపుకొనే ప్రేమలెందుకు?

నిజమైన ప్రేమ అజరామరమైనది. అది ఎప్పుడూ త్యాగాన్నే కోరుకుంటుందన్నమాట తప్పని రుజువౌతోందా? అంటే అవుననే నిరూపిస్తున్నాయి ప్రస్తుతం జరుగుతున్న సంఘటనలు. గత కొన్నాళ్లగా మనదేశంలో ప్రేమికుల చేతుల్లో ముక్కలు,ముక్కలుగా నరకబడుతున్న ప్రియురాండ్ల శరీర భాగాలు దీన్నే నిరూపిస్తున్నాయి.

నిజమైన ప్రేమ అజరామరమైనది. ది ఎప్పుడూ త్యాగాన్నే కోరుకుంటుందన్నమాట తప్పని రుజువౌతోందా? అంటే అవుననే నిరూపిస్తున్నాయి ప్రస్తుతం జరుగుతున్న సంఘటనలు. గత కొన్నాళ్లుగా మనదేశంలో ప్రేమికుల చేతుల్లో ముక్కలు, ముక్కలుగా నరకబడుతున్న ప్రియురాండ్ల శరీర భాగాలు దీన్నే నిరూపిస్తున్నాయి. ప్రేమ తమకు దక్కనప్పుడు త్యాగాన్ని కాదు..ద్వేషపు విషాన్ని విరజిమ్ముతున్న వైనం ఆందోళన కలిగిస్తున్నది.

గతేడాది నవంబరులో ఢిల్లీలో జరిగిన ఒక సంఘటనను గుర్తు చేసుకుందాం. శ్రద్ధావాకర్, ఆఫ్తాబ్ ఒకరినొక రు ప్రేమించుకొన్నారు. అయితే వారి కుటుంబా లు ఒప్పుకోక పోవడంతో అది పెండ్లికి దారితీయలేదు. దీంతో శ్రద్ధా వాకర్ తన తల్లిదండ్రులను కాదనుకొని తన ప్రియుడైన ఆఫ్తాబ్‌నే జీవిత సర్వస్వంగా భావించి అతనితో వెళ్లి పోయింది. నాలుగేండ్ల పాటు ఇద్దరూ సహజీవనం చేశారు. ఆ సమయంలో తనను పెండ్లి చేసుకోవాలని ఒత్తి డి తీసుకు రావడంతో పెండ్లి ఇష్టంలేని ఆఫ్తాబ్ ఆమెను వదిలించుకోవడానికి హంతకుడిగా మా రాడు. శ్రద్ధను 35 ముక్కలుగా నరికి వేర్వేరు ప్రాంతాల్లో పడేశాడు. దీనికి కొనసాగింపుగా పంజాబ్‌లో యూపీలో, బీహార్‌లో ఇలాంటి హేయమైన సంఘటనలే జరిగాయి. ఇటీవల ఢిల్లీలో మరో పదహారేండ్ల బాలికను ఆమె ప్రియుడు 34 కత్తిపోట్లతో అత్యం త కిరాతకంగా హత్య చేసిన వైనం ఆందోళన కలిగిస్తున్నది.

### విఫలప్రేమలు ఇప్పటివేం కాదు..

దేవదాసు-పార్వతి, హీర్-రాంజా, సలీం-అనార్కలి. రోమియో.-జూలియట్‌ల ప్రేమకథ లు మనకు తెలిసినవే. ఈ కథల్లో పేమను త్యాగం చేసి ప్రేమ అనే పదానికి జీవం పోసిన ఉదంతాలే కనిపిస్తాయి. లేదంటే ప్రేమకోసం ఇద్దరూ తమ ప్రాణాలను త్యాగం చేసిన సందర్భాలే కనిపిస్తా యి. అదే విధంగాప్రేమలో మోసపోయి తమ ప్రేమికుల ఎడబాటును తట్టుకోలేక ఇద్దరిలో ఎవ రో ఒకరు బలవన్మరణాలకు పాల్పడిన ఘటన లూ ఉన్నాయి.

ఇక కొన్ని ప్రేమలు పరువు హత్యలకు దారి తీసిన సందర్భాలున్నాయి. తక్కువ కులం వారిని ప్రేమించారనే నేపంతో అమ్మాయి తల్లిదండ్రులు సదరు అబ్బాయినో, లేదా వారి అమ్మాయినో, మరికొన్ని సందర్భాల్లో ఇద్దరినో కడతేరుస్తున్నారు. వీటన్నింటికి భిన్నంగా ఇప్పు డు ప్రేమికులే ఉన్మాదులుగా మారుతున్నారు. ఈతరం ప్రేమికులు తమ ప్రేమ విఫలమైనప్పుడు మృగాలుగా మారుతున్నారు. తమ ప్రి యురాండ్లను ముక్కలుగా నరికి చెట్టుకో, పుట్ట కో పడేస్తున్నారు. ఇలాంటి ఘోరాలలో వారి మానసిక స్థితిని అంచనా వేసే క్రమంలో తల పండిన సైకాలజిస్టులకే వెన్నులో వణుకుపుడుతున్న సందర్భాలు లేకపోలేదు. నాలుగైదేండ్లు తమతో సహజీవనం తర్వాత ఓ మనిషి తన జీవన సహ చరిని చంపాలన్నంత కోపం ఎందుకొస్తున్నది. కొన్ని సందర్భాల్లో శరీరభాగాల్లో కొన్నింటిని ఇంట్లోనే ఉంచుకొని ఇతర పనులు చేసు కోవడమో, మరో అమ్మాయితో గడ పడమో చేస్తున్నారంటే వారి మానసిక స్థితిని అర్థం చేసు కోవచ్చు. ఈ మధ్య కాలంలో ఇలాంటి కిరాతక ప్రవృత్తి ప్రేమికుల నుంచి వివాహేతర సంబంధాల వలలో చిక్కు కున్న వారికి వ్యాపి స్తున్నది. తమ అక్రమ లైంగిక సంబం ధాలను కప్పి పుచ్చుకోవడానికి తమ జీవిత భాగస్వాములను సైతం ఆనవాళ్ళు దొరకకుండా చేస్తున్నారు. ఈ విషయంలో ఆడవారి పాత్రే ఎక్కువగా ఉండడం గమనార్హం. ఈ నేపథ్యంలో వారిలో ఈ అమానవీయ రాక్షస ప్రవృత్తిని కలిగి స్తున్నదెవరో తెలుసుకోలేక పోతే పరిస్థితులు మరింత విషమించి పోయే ప్రమాదం లేక పోలేదు. ఇలాంటి హేయ మైన నేరాల పరిశోధనలో భాగంగా సంబంధిత అధికారులు నిందితులను ఇంటరాగేట్ చేస్తునప్పుడు అనేక ఆందోళన కరమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి.

# పాత నగరం బోనాలకు 250 కోట్లు




చార్మినార్ : వచ్చే నెల 16న జరిగే పాత నగరం ఆషాఢ బోనాల ఉత్సవాల నిర్వహణకు రూ.250 కోట్లతో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. సాలార్జంగ్ మ్యూజియంలో పాత నగరం బోనాల నిర్వహణ, ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. తెలంగాణ సంసృతికి ప్రతీకగా నిలిచే బోనాలను ఘనంగా నిర్వహించాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఏర్పాట్లను చేస్తున్నట్లు పేర్కొన్నారు. బోనాల ఉత్సవాలను తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర పండుగగా ప్రకటించారని, నాటి నుంచి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తూ ఘనంగా నిర్వహిస్తున్నదని వివరించారు. బోనాల ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో వివిధ దేవాలయాలకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం రూ.15 కోట్లు విడుదల చేసిందని మంత్రి తెలిపారు.

### 13వ తేదీలోపు పనులన్నీ పూర్తి..

ప్రైవేట్ దేవాలయాలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వివరించారు. బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగేలా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు , శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అదనపు ట్రాన్స్ ఫార్మర్‌లు, జనరేటర్‌లను అందుబాటులో ఉంచుతామని పేరొన్నారు. భక్తులకు తాగునీరు, రహదారుల మరమ్మతులు, వాటర్, సీవరేజ్ లైన్ వంటి అభివృద్ధి పనులు ఏమైనా ఉంటే వచ్చే నెల 13వ తేదీలోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆలయ పరిసరాలు, కాలనీలు, రోడ్లపై చెత్త లేకుండా తొలగించాలని తెలిపారు. ఈ సమావేశంలో బేగంబజార్ కార్పొరేటర్ శంకర్ యాదవ్, ఉమ్మడి దేవాలయాల కమిటీ చైర్మన్ ఆలె భాసర్ రాజ్, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, వాటర్ వర్క్స్ డైరెక్టర్ కృష్ణ, సౌత్ జోన్ డీసీపీ సాయి చైతన్య, ట్రాఫిక్ డీసీపీ అశోక్ కుమార్, ఆర్అండ్‌బీ ఎస్ఈ హఫీజుద్దిన్, టూరిజం ఎండీ మనోహర్, ట్రాన్స్‌కో ఎస్ఈ అబ్దుల్ రహమాన్, దేవాలయాల కమిటీ ప్రతినిధులు, శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఊరేగింపుల్లో.. ఇబ్బందులు రావొద్దు..

అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలిగేలా చూడాలని సంబంధిత అధికారులను మంత్రి తలసాని ఆదేశించారు. అకన్న మాదన్న, సబ్జిమండి ఆలయాలకు అమ్మవార్ల ఊరేగింపు కోసం అంబారి (ఏనుగు)ను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశా రు. వివిధ ప్రాంతాల్లోని ప్రజలు టీవీల్లో వీక్షించేలా ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

17 వ తేదీన అకన్న మాదన్న దేవాలయం నుంచి ఢిల్లీ దర్వాజ వరకు నిర్వహించే ఉమ్మడి దేవాలయాల ఊరేగింపునకు కూడా ఎలాంటి ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. ఊరేగింపును కొంచెం త్వరగా ప్రారంభించాలని నిర్వాహకులను మంత్రి కోరారు.

కిందకు వేలాడుతూ ఉండే విద్యుత్ తీగలను తొలగించాలని, అవసరమైన చోట్ల రోడ్ల మరమ్మతులు చేపట్టాలన్నారు.

దమయంతి భవన్, ఢిల్లీ దర్వాజల వద్ద త్రిడీ మ్యాపింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను నిర్వహించామని వివరించారు.

# అమెరికాపై నిఘా కోసమే చైనా బెలూన్..



దిల్లీ: ఈ ఏడాది ఆరంభంలో అమెరికా గగనతలంలో చైనా గూఢచర్య బెలూన్ తీవ్ర కలకలం రేపింది. అమెరికాపై నిఘా పెట్టేందుకే డ్రాగన్ దీనిని ప్రయోగించిందని అగ్రరాజ్యం తాజాగా తేల్చింది. కాగా.. ఇందుకోసం అమెరికా సాంకేతికతనే చైనా కూడా ఉపయోగించినట్లు బయటపడింది. ఈ మేరకు వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనంలో వెల్లడించింది. ఈ బెలూన్‌ను అమెరికా కూల్చివేసి శకలాలను సేకరించిన విషయం తెలిసిందే. వాటిపై ఆ దేశ రక్షణశాఖ, నిఘా సంస్థలు దర్యాప్తు చేపట్టాయి. ఈ బెలూన్‌లో యూఎస్ గేర్‌తో పాటు ప్రత్యేకమైన చైనీస్ సెన్సార్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ సాంకేతికతతో అమెరికాలోని కీలక ప్రదేశాల ఫొటోలు, వీడియోలు, ఇతర సమాచారాన్ని సేకరించి బీజింగ్‌కు బదిలీ చేయాలని ప్రయత్నించిందని అమెరికా విశ్వసనీయ వర్గాలు వెల్లడించినట్లు సదరు కథనం పేర్కొంది. ఇది వాతావరణ పరిశోధన కోసం ప్రయోగించిన బెలూన్ కాదని.. అమెరికాపై నిఘా పెట్టాలనే ఉద్దేశంతోనే దీన్ని పంపించారని దర్యాప్తులో తేలినట్లు అధికారులు అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ బెలూన్ అలస్కా, కెనడాతో పాటు అమెరికాలోని కొన్ని రాష్ట్రాల గగనతలాల మీదుగా ఎనిమిది రోజుల పాటు ప్రయాణించింది. అయితే, ఈ సమయంలో ఎలాంటి డేటాను ఈ బెలూన్ చైనాకు బదిలీ చేసినట్లు ఆధారాలు లభించలేదని అధికారులు చెబుతున్నారు. ఈ దర్యాప్తు అంశాలపై అటు శ్వేతసౌధం గానీ.. ఇటు ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ గానీ స్పందించలేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో చైనాకు చెందిన ఓ భారీ బెలూన్ అమెరికాలోని పలు ప్రాంతాల్లో కన్పించింది. అణు క్షిపణుల ప్రయోగ కేంద్రం ఉన్న మోంటానాలో ఈ బెలూన్ కన్పించడంతో అమెరికా దీన్ని తీవ్రంగా పరిగణించింది. యుద్ధ విమానాన్ని ప్రయోగించి దీన్ని కూల్చివేసింది. ఈ ఘటన అప్పట్లో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచింది. ఈ పరిణామాలతో అగ్రరాజ్య విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ చైనా పర్యటన కూడా రద్దైన విషయం తెలిసిందే.

# కవి సమయం

## 'ప్రేమ'

సృష్టిలో తీయనిది ప్రేమోనోయ్
అనంతమైనది, అద్భుతమైనది ప్రేమ
ప్రపంచం అంతా ప్రేమమయం
సముద్రం నుండి అలలు
చంద్రుని నుండి వెన్నెల
సూర్యుని నుండి కిరణాలు
దైవం నుండి ప్రేమ దివ్యలీల
కర్మశ హృదయాన్ని మార్చే శక్తి
ప్రేమే సృష్టికి మూలం, జీవనాధారం
ప్రేమే ధర్మం, ప్రేమే భాష్యం
ప్రేమే కావ్యం, ప్రేమే సర్వశ్వం
ఎన్నటికీ మారనిది, త్యాగం కలిగి
ప్రతి ఫలాన్ని ఆశించనిది
నిత్యము, సత్యము, శాశ్వతము

...కవితా రచన
సి.ప్రతాప్

# పంచాంగం

| మాసం : ఆషాడం; తిథి : ద్వాదశి రా.10.01; విశాఖ మ.1.28; వ.సా.5.26ల 7.01. | శుక్రవారం 30-06-2023 |
|---|---|

a **మేషం** : దూర ప్రయాణాలు చేస్తారు. శరీర వత్తిడి, అలసటి ఎక్కువగా ఉంటుంది. స్త్రీలు షాపింగ్ వ్యవహారాలలో అపరిచిత వ్యక్తులపట్ల మెళు కువ అవ సరం. పత్రికా సంస్థలలోని వారికి పనిభారం, విశ్రాంతి లోపం వంటి చికాకులు అధికం. నిర్మాణ పనులలో జాప్యం, అధిక వ్యయం వల్ల ఆందోళనకు గురవు తారు. రావలసిన ధనం వాయిదాపడుట వల్ల ఆందోళనకు గురవుతారు.

b **వృషభం** : సమయానికి నిద్రా, భోజనం ఉండదు. దీర్ఘరోగులు మాత్రం జాగ్రత్త అవసరం. నిరుద్యోగులకు ఉపశమనం కలుగుతుంది.

c **మిథునం** : తఉద్యోగులకు పై అధికారుల వత్తిడి కలుగుతుంది. దూరపు బంధువులతో ఇష్టాగోష్టి చేస్తాడు. విందు, వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

d **కర్కాటకం** : నూతన వ్యాపారాలు చేయువారి వ్యవహారాలు అనుకూలించును. అవసరాలకు అనుకున్న సమయానికి ధనం చేతికి అందు తుంది. పాత సన్నిహితులను కలుసుకుంటారు. రాజకీయ నాయకులకు అనుకూలం. ఆరోగ్యం బాగుంటుంది.

e **సింహం** : ఆర్థిక విషయాల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. రుణాలు మంజూరు అగును. బిందువుల కొరకు విలువైన వస్తువులను కొంటారు. సన్నిహితులతో కలిసి విందు, వినోద కార్యకలాపాలు సాగిస్తారు.

f **కన్య** : హోటల్, కేటరింగ్ రంగాల్లోవారు పని వారితో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఆలయ సందర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు. కోర్టు వాదోపవాదాల్లో ప్లీడర్లు విజయం సాధిస్తారు. మీ శ్రీమతి సహాయం లేనిదే మీ సమస్యలు పరిష్కారం కావని గ్రహించండి. ఇతరుల మెప్పుకోసం శ్రమాధిక్యత, ఒత్తిడి ఎదుర్కొనవలసివస్తుంది.

g **తుల** : ప్రయాణాల లోనూ, బ్యాంక్ వ్యవహారాలలోను ఇబ్బందులను ఎదుర్కొంటారు. పత్రికా, ప్రైవేటు రంగాల వారికి ఆర్థిక ప్రగతితో కూడిన అవకాశాలు లభిస్తాయి. రావాణా రంగాలలోని వారికి చికాకులుతప్పవు. బంధువుల రాకతో గృహంలో సందడి కాన వస్తుంది. పెట్టుబడుల విషయంలో పునరాలోచన చాలా అవసరం.

h **వృశ్చికం** : కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరవుతాయి. మీరు అనుకున్న సాహసో పేతమైన నిర్ణయాలు మంచి ఫలితాలనిస్తాయి. వ్యాపారాల్లో నిలదొక్కు కోవటానికి మరింతగా శ్రమించవలసి ఉంటుంది. ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. ప్లీడర్లకు, ప్లీడరు గుమస్తాలకు, వైద్యులకు అను కూలత


.i **ధనుస్సు** : స్థిరాస్థులు విక్రయించాలనే ఆలోచన విరమించు కోవడం మంచిది. విద్యార్థులకు మిత్రబృందాల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది మెళకువ వహించండి. బ్యాంకు వ్యవహారాలలో అపరిచిత వ్యక్తులపట్ల మీ కృషికి తగిన ప్రతిఫలం ఉంటుంది. స్త్రీలతో అతిగా సంభాషిం చటం వల్ల అపార్థాలకు గురికావలసి వస్తుంది.

j **మకరం** :వృత్తిపరమైన సమా వేశాలకు అనుకూలం. లక్ష్యసాధనకు మీరే చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. న్యాయ, బోధన కళారంగాల వారికి శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. దీక్షా పట్టుదలతో అనుకున్న లక్ష్యం సాధిస్తారు. వ్యాపారాల్లో భాగస్వామి సహాయ సమకారం లభిస్తుంది.

k **కుంభం** : రాజకీయ, సినీరంగ కళాకారులకు శుభప్రదం. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. దూర ప్రయాణాలకు సంబంధించి ప్రయత్నాలు ఫలిస్తాయి. దీర్ఘకాలంగా వాయిదాపడిన పనులు పూర్తిఅగును. పై అధికారుల మన్నలు పొందుతారు. **మీనం** : శారీరక శ్రమ, అకాల భోజనం వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. ప్రియ మైన వ్యక్తులను కలుసుకుంటారు. ఉద్యోగ స్తులకు పెండింగ్ పనులపై దృష్టి సారి స్తారు. ఆలయాలను సందర్శిస్తారు. స్టాక్ మార్కెట్ రంగాల వారి అంచనా నిరుత్సా హపరుస్తాయి. ఏ విషయంలోను హామీ ఇవ్వకుండా లౌక్యంగా దాటవేయండి..

# చందన రూపుడు... సింహాచలేశుడు


## సంకీర్తన



దేశంలోని అన్ని నారసింహ క్షేత్రాల్లో విశాఖపట్నం జిల్లాలోని సింహాచలం క్షేత్రం అతి ప్రాచీనమైనది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ విశాఖపట్నం నగరానికి 11 కి.మీల దూరంలో తూర్పు కనుమల్లోని సింహగిరిపై సముద్రమట్టానికి 800 అడుగుల(244మీ)ఎత్తున ప్రశాంత వాతావరణంలో శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయం ఉంది. ఇక్కడ స్వామి స్వయంభువుగా వెలిశారు. సింహాచలం ప్రముఖ హిందూ పుణ్యక్షేత్రంగా ఉంది. విశాఖ పరిసర ప్రాంతాలతో పాటు ఉత్తరాంధ్ర, ఒడిశా ప్రాంత భక్తులంతా సింహాద్రి అప్పన్నగా పిలుచుకునే వరాహ లక్ష్మీ నరసింహస్వామి ఇక్కడ కొలువ్కై ఉన్నాడు. నిత్యం చందనంతో కప్పబడి కనిపించే ఈ స్వామి నిజరూప దర్శన సమయాన్ని చందన యాత్ర లేదా చందనోత్సవం అని అంటారు. ఇది ప్రతి సంవత్సరం వ్కైశాఖ శుద్ధ తదియ (మే నెలలో) వస్తుంది.

### ఆలయ చరిత్ర-స్థల పురాణం

స్వయంభూన సింహాచల శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి వారికి ఇక్కడ 11వ శతాబ్దంలో ఆలయాన్ని నిర్మించినట్లు స్థలపురాణం బట్టి తెలుస్తోంది. కళింగ శైలిలో నిర్మించిన ఈ ఆలయం అదుతేమైన శిల్ప కళ, అందమైన గోపురాలతో భక్తులకు కనువిందు చేస్తుంది. ఆలయంలో పలు చారిత్రక సందరాశ్లో వేసిన శిలా శాసనాలు చారిత్రక పరిశోధకులను ఆకర్షిస్తాయి. సత్యకాలంలో వేదాలు అపహరించిన హిరణ్యాక్షుడిని సంహరించిన వరాహ అవతారం, ఆ తర్వాత యుగంలో హరి ద్వేషంతో.. భక్తులను హింసించిన హిరణ్యకశిపుని వధించిన న ృసింహావతారాల కలయికగా.. స్వామి ఇక్కడ వరాహ న ృసింహ స్వామిగా స్వయం వ్యక్తమయ్యారు. పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం ఇక్కడ రోజూ నాలుగు వేదాలు, నాలాయిర దివ్య ప్రబంధాలు, పురాణాలు స్వామి వారి సన్నిధిలో పారాయణ చేస్తారు. ఇది దక్షిణ భారతదేశంలోని ముఖ్యమైన వ్కైష?వ పుణ్యక్షేత్రాల్లో ఒకటి. తిరుపతి తర్వాత అత్యధిక ఆదాయం (రూ.52 కోట్లు)కలిగిన దేవాలయమిదే. ఏడాది మొత్తంలో 12 గంటలు మాత్రమే దేవుడి నిజరూప దర్శనం భక్తులకు లభిస్తుంది. శ్రీవరాహ లక్ష్మీ న ృసింహస్వామి వారు ఏడాదిలో 364 రోజులు సుగంధ భరిత చంద నంతో కప్పబడి ఉంటారు. భక్తులకు నిత్యం దర్శనం ఇచ్చేది.. ఈ చందన అవ తారంలో వుండే స్వామి వారే. ఏటా ఒక్క వైశాఖ శుద్ధ తదియ నాడు మాత్రమే.. అర్థరాత్రి నుంచి మరుసటి రోజు మధ్యాహ్నం వరకూ ఆ నిజరూప దర్శనం ఉంటుంది. స్వామి వారి నుంచి తొలగించిన గంధాన్ని చందన ప్రసా దంగా భక్తులకు అందజేస్తారు. అలాగే గిరి ప్రదక్షిణ కూడా ఇక్కడ ప్రత్యేకంగా జరిగే ఉత్సవం. మిగతా సమయాల్లోనూ ఎంతో రద్దీగా ఉండే సింహాచలం ఆలయం ఈ రెండు సందరాశ్లో ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బంగా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి తరలివచ్చే లక్షల మంది భక్తులతో మరింత రద్దీగా మారుతుంది. ఈ సందర్భంగా ప్రత్యేక ఆర్జిత సేవలు ఉంటాయి. ఆలయంలో కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకొని కోరికలు కోరుకుంటే అవి తీరుతాయనేది భక్తుల విశ్వాసం.



# రాష్ట్రాన్ని దివాళా తీసే స్థితికి సీఎం జగన్ తీసుకొచ్చారు

## – మాజీ మంత్రి కోండ్రు






రాజాం, విజయభాను న్యూస్ : ప్రతీ ఒక్క సామాజిక వర్గాన్ని దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు భరోసాను చంద్రబాబునాయుడు కల్పించారని మాజీ మంత్రి వర్యులు తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఇన్చార్జి కోండ్రు మురళీమోహన్ అన్నారు, గురువారం నాడు విశాఖ తూర్పు నియోజకవర్గం లో భవిష్యత్తుకు గ్యారంటీ చైతన్య రథ బస్సు యాత్ర కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యలపై ప్రసంగించారు,పేద, మధ్య తరగతి కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని మహిళల కోసం మహాశక్తి18 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1500 ఇంట్లో ఉండే మహిళలు ఎంత మంది ఉంటే అంతమందికీ ఆడబిడ్డనిధి,ఇంట్లో చదువు కొనే పిల్లలు ఎంతమంది ఉన్నా అందరికీ ఒక్కొక్కరికి 15 వేల చొప్పున ప్రోత్సాహకం,దీపం పథకం క్రింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, మహిళలు జిల్లాలో ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయాణించినా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులు అనే నిబంధన తొలగింపు, తాగునీటి కోసం మహిళలు ఎక్కడెక్కడి నుంచో నీరు మోసు కొంటూ తెచ్చు కోవాల్సిన అవసరం లేకుండా ఇంటిం టికీ తాగు నీటి కొళాయి కనెక్షన్, పేద వారిని జీవితాంతం పేద రికంలోనే ఉంచడం కాకుండా వారిని ధనికులను చేయడానికి పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్షిప్ తరహాలో ప్రజల భాగస్వా మ్యంతో నిర్దిష్ట కార్యక్రమం వంటి విప్ల వాత్మక మైన పథకాలు తెచ్చి మహిళలను మహ రానులుగా తీర్చి దిద్దేందుకు చంద్రబాబు శ్రీకారం చుట్టి మానిఫెస్టోతో మహిళలు ఎంతో సంతోషం వ్యక్తం చెయ్యడం గర్వించదగ్గ విషయం అన్నారు, ప్రస్తుత పరిస్థితిలో రాష్ట్రం దివాలా తీసే పరిస్థితి నుంచి గట్టెక్కించి, అభివృద్ధి పథంలో నడ వాలంటే అది ఒక్క తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చి నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తేనే సాధ్యం అని కోండ్రు అన్నారు,రాష్ట్రంలో ఎక్కడ చూసినా భూ ఆక్రమణలు, దాడులు ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు చేపట్టడమే పాలనగా కొనసాగిస్తూ సీఎం జగన్ రెడ్డి పాలన కొన సాగిస్తున్నారని అన్నారు.

వైసీపీ పాలనలో ఎస్సీ ఎస్టీ బీసీ లు దగా పడ్డారన్నారని దుయ్య బట్టారు. ప్రజలకు అందుబాటులో ఉండే నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెంచి జె టాక్సు లతో ప్రజల నడ్డి విరిచా రన్నారని మండిపడ్డారు,వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టి రాష్ట్ర సంక్షేమం అభివృద్ధి ని గాలికి వదిలే శారన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి పాద యాత్రలో ఇచ్చిన మోసపు హామీలను నమ్మి ప్రజలు అధికారం కట్టబెడితే ప్రజ లను నట్టేట ముంచా రన్నారు. చంద్రబాబుతో నే మళ్ళీ రాష్ట్ర సంక్షేమం అభివృద్ధి అని కోండ్రు అన్నారు,ఈ కార్య క్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళలు,కార్యకర్తలు అభిమానులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# భవిష్యత్తు గ్యారంటీ.. బస్సుయాత్రను విజయవంతం చేయండి

## టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పిలుపు




భీమునిపట్నం : విజయ భాను న్యూస్ : టీడీపీ అధినేత నారా చంద్ర బాబు నాయుడు ప్రవేశపెట్టిన పేదల మేనిపెస్టో ప్రజలను ఉన్నత మైన స్థాయిలో పెట్టేవిధంగా ఉందని టీడీపీ రాష్ట్ర కార్య దర్శి, గంటా నూకరాజు అన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో గంటా నూకరాజు, జనరల్ సెక్రటరీ గొలగాని నరేంద్రకుమార్ ఆధ్వ ర్యంలో అత్యవసర సమావేశం నిర్వ హించారు . ఈ సందర్భంగా గంటా నూకరాజు మాట్లాడుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మహానాడు వేదికగా ప్రవేశపెట్టిన మేనిపెస్టో ప్రతీ సామాన్యుడుకి ఉపయోగపడేదిగా ఉందని అన్నారు. ఈ మేని పెస్టో ప్రతీ ఒక్కరికీ చేరాలనే ఉద్దేశ్యంతో భవిష్యత్ గ్యారంటీ.. చైతన్య రథయాత్ర (బస్సు యాత్ర) రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు సూచనలు ప్రకారం చేపడుతున్నామని అన్నారు. ఈ బస్సుయాత్ర భీమిలి జోన్ 3వ వార్డులో శనివారం బోయవీధిలో ఏర్పాటు చేయ బడునని బస్సుయాత్ర బీచ్ రోడ్డులో ఎగువపేట, బోయవీధి, లైట్ హౌస్, పాత బస్టాండ్, గంటస్తంభం, నూకాలమ్మ గుడి, డైట్ మీదుగా చిన్న బజార్ వరకు ఈ యాత్ర సాగుతుందని అన్నారు. ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా పేదల అభివృద్దే లక్ష్యంగా ప్రకటించిన పథకాలతో ప్రజల్లో నూతన ఉత్సాహం మొదల యిందని అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శనివారం జరుగు బస్సుయాత్రను విజయవంతం చేయాలని గంటా నూక రాజు పిలుపు నిచ్చారు.

ఈ కార్యక్రమంలో...

గొలగాని నరేంద్రకుమార్, మారోజు సంజీవకుమార్, పెంటపల్లి యోగేశ్వర రావు కనకల అప్పల నాయుడు, సంకురుభుక్త జోగారావు,, కొక్కిరి అప్పన్న, గండి బోయిన పోలిరాజు, అప్పికొండ నూకరాజు, నెక్కెళ్ళ వెంకట రావు, వియ్యపు పోతురాజు, అప్పికొండ నర్సింగరావు, వాసుపల్లి వంశీ తదితరులు పాల్గొన్నారు.

# వైకాపా ప్రభుత్వంలో ప్రతి ఇంట సంక్షేమం

## – ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



గాజువాక (విజయభాను న్యూస్): అభివృద్ధి సంక్షేమే ద్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగు టతుందనీ గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గురువారం జీవీఎంసీ 74వ వార్డు దయాల్ నగర్ పోలీసు క్వార్టర్స్ ఎదురుగా గౌరీ సేవా సంఘం దగ్గర 74వ వార్డు కార్పొరేటర్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ తిప్పల వంశీ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని ఇంటి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించడమే కాకుండా వారి నుండి సమస్యలు అడిగి తెలుసుకొని అక్కడే వున్నా సచివాలయం సిబ్బందికి తెలియచేసి వాటిని తక్షణమే పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. అనంతరం తిప్పలనాగిరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇంటి ఇంటికి వైద్యం అందేలా కృషిచేస్తున్నారని అన్నారు. విద్యా వైద్యం రెండుకళ్లుగా భావించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో కార్పొరేట్ స్కూలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారని, అదేవిధంగా ఆరోగ్య కేంద్రాలు నిర్మించారని అన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక వైకాపా ఇంచార్జ్ దేవన్, నాయకులు ఎన్ వై నాయుడు, అనపర్తి త్రినాథ్, ఎస్ రాజారావు, పవన్ కుమార్, సీకు రమణ, సీతారాం, ఆళ్ల రామకృష్ణ, డి శ్రీనివాసరావు, ఏ రాము, గౌరుసు రామలక్ష్మి పాల్గొన్నారు.

# నిరుపేదలకు కుట్టు మిషన్ అందజేత



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : చారిటీ బాక్సు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కిడ్నీ పేషెంట్ గోవిందరావుకు గురువారం కుట్టు మిషన్ అందజేశారు. ఈయన ఎంవీపీ కాలనీలోని ఓ గ్రూప్ హౌస్‌లో వాచ్మెన్ గా పని చేస్తున్నారు. ఆ గ్రూప్ హౌస్‌లో ఆయనకు మూడు వేలు జీతం. టైలరింగ్ కూడా రావడంతో ఆ జీతం, స్టిచ్చింగ్ లో వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నారు. ఇటీవల అనారోగ్యం బారినపడ్డారు. కిడ్నీలో రాళ్లు పడటంతో నెల రోజుల నుంచి ఆసుపత్రి చుట్టూ తిరుగు తున్నారు. కాళ్లతో తొక్కే మిషన్ పాతది కావడం, అది సరిగా పని చేయకపోవడం, కాళ్లతో తొక్కేందుకు ఇబ్బంది పడుతున్నారు. దీంతో మోటార్ ఉన్న ఫోల్డింగ్ మిషన్ ఉంటే కుటుంబానికి కాస్త ఆసరాగా ఉంటుందని ఆయన చారిటీ బాక్సును ఆశ్రయించారు. చారిటీ బాక్సు సభ్యులు సహృదయంతో రూ.11 వేల ఐదు వందల రూపాయల విలువ గల కుట్టు మిషన్ అందజేశారు. ఈ సందర్భంగా చారిటీ బాక్సు ప్రతినిధి చెక్కా రమాదేవి మాట్లాడుతూ చారిటీ బాక్సు ఎప్పుడూ నిరుపేదలు, నిరాశ్రయుల పట్ల దయతో వ్యవహరిస్తుందన్నారు. గత రెండేళు ౹గా రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. నిత్యావసరాల పంపిణీ, అన్నదానాలు చేస్తూ వస్తున్నామన్నారు. ఇటీవల చారిటీ బాక్సు అభాగ్యుల శాశ్వత ఉపాధే లక్ష్యంగా అడుగులు వేస్తుందని చెప్పారు. అందులో భాగంగా కుట్టు మిషన్ అందజేశామన్నారు. ఇటీవల ఓ దివ్యాంగుడికి నలబై వేలు ఖర్చు పెట్టి వెహికల్స్ కు గాలి కొట్టే ఎయిర్ ఫిల్లింగ్ మిషన్ ఇచ్చామన్నారు. మరో వారంలో శ్రీకాకుళంలో ఒక కుటుంబానికి కుట్టు మిషన్ అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చారిటీ బాక్సు ప్రతినిధులు దౌలూరు శంకరరావు, తాటికొండ కరుణా కర్, మదీనా (మున్నీ), కొంతం శివాజీ ప్రసాద్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

# అగ్రిగోల్డ్ బాధితుడు గుండెపోటుతో మృతి

- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు
- బాధిత కుటుంబానికి 10 లక్షల ఎక్స్గ్రేషియా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలి.
- అగ్రిగోల్డ్ బాధితులు మృతులు ప్రభుత్వ హత్యలు




కాకినాడ, విజయభాను న్యూస్ : అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ లో ఉన్న నూకిరెడ్డి నాగరాజు అనే బాధితుడు బుధవారం మధ్యాహ్నం గుండిపోటుతో మృతి చెందాడు. మృతి చెందిన విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బాబి, బొమ్మిటి రాంబాబు, అర్జున్ రావు, చంద్రశేఖర్, బాధిత కుటుంబాన్ని గురువారం ఉదయం పరామర్శించారు. ఈ సందర్భంగా తోకల ప్రసాద్ మాట్లాడుతూ నూకిరెడ్డి నాగరాజు భార్య ఉమాలక్ష్మి ఇద్దరు అబ్బాయిలు ఉన్నారని, అగ్రిగోల్డ్ సంస్థ మూతబడిన తర్వాత జీవనోపాధి కోల్పోయిన నాగరాజు వయస్సు సగం పూర్తయిన తర్వాత ఏ ఉద్యోగము రాక చివరికి తన కుటుంబాన్ని పోషించుకొనుటకు స్వీట్ స్టాల్ నిర్వహించుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకునేవాడని ప్రసాద్ అన్నారు. నాగరాజు రాజు అగ్రిగోల్డ్ బాధితుడిగా మొదటగా తన సొంత డబ్బులు మరియు చుట్టాల డబ్బులతో సుమారుగా 5 లక్షల రూపాయల వరకు కట్టడం జరిగిందని, ఆ తర్వాత ఇతరులచే మూడు లక్షల రూపాయల వరకు కట్టించాడని మొత్తం ఎనిమిది లక్షల రూపాయల వరకు 30 వేలకు పైగా బాండ్ రూపంలో అగ్రిగోల్డ్ కి చెల్లించడం జరిగింది అని ప్రసాద్ అన్నారు. ఇప్పటివరకు అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ రూపంలో ఉన్న సొమ్మును ప్రభుత్వం మంజూరు చేస్తుందని గుండె ధైర్యంతో ఉన్నారని, ఈ రాష్ట్ర ప్రభుత్వం పదవీకాలం చివరి దశకు చేరుతున్న తరుణంలో ఈ ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు ఉన్న బాండ్స్ రూపంలో ఉన్న సొమ్ము చెల్లించలేకపోవడం వల్ల, తీసుకున్న అప్పులు వారికి తిరిగి తీర్చలేక, మనో వేదనకు గురై అప్పుల బాధలతో, అప్పులు ఊబిలోకి కోరుకున్న నూకిరెడ్డి నాగరాజు నిరంతరం ఆలోచించడం వల్ల సుమారుగా తొమ్మిది సంవత్సరాలు పాటు కోర్టు చుట్టూ తిరిగి తిరగడంతో హఠాత్తుగా నిన్న మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందాడని ప్రసాద్ తన ఆవేదన వ్యక్తం చేశారు. నాగరాజు మృతి వారి కుటుంబానికి తీరని లోటని, ప్రభుత్వం మోసపూరితమైన వాగ్దానాలు నమ్మి అగ్రిగోల్డ్ బాధితులు మృతి చెందుతున్నారని, ఈ మృతులన్నీ ప్రభుత్వ హత్యలుగా పరిగణించాలని ప్రసాద్ అన్నారు. అగ్రిగోల్డ్ కి కోట్లాది రూపాయలు విలువైన ఆస్తులు ఉన్న బాధితులు బాధలకు పంపిణీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, బాధిత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుని 10 లక్షల ఎక్స్గ్రేషియా తక్షణమే ప్రకటించాలని, బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి, అగ్రిగోల్డ్ బాధితులు న్యాయం జరిగే వరకూ సిపిఐ, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మృతి చెందిన నూకిరెడ్డి నాగరాజు కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని, ఇలాంటి వ్యక్తులు మరొకరు మృతి చెందకుండా రాష్ట్ర ప్రభుత్వం అగ్రిగోల్డ్ ఆస్తులని దప్తు చేసి, ఆస్తులు అన్ని 20 వేలకు, 30 వేలకు పైగా ఉన్న బాండ్లను తక్షణమే చెల్లించాలని ప్రసాద అన్నారు. దీని లో అసోసియేషన్ నాయకులు తదితర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# రూ.13,000/- లు ముగ్గురికి ఎమ్మెల్యే వాసుపల్లి వితరణ



అక్కయ్యపాలెం (విజయభాను న్యూస్) : ప్రజాదర్బార్ లో వచ్చిన మెడికల్ ట్రీట్మెంట్ సమస్యలకు పరిష్కారం దిశగా వారి ఇండ్లకు వెళ్లి పరామర్శించి ఆర్థిక సహాయం చేసిన ఎమ్మెల్యే వాసుపల్లిలి చల్లా సాయిరాం రెడ్డి, 53సం" (షుగర్ – మెడిసిన్ కొరకు) దొండపర్తి, రామాలయం వీధి, 27వార్డ్ కి రూ.5,000/-లు. చెల్లూరు రోహిత మహి, 12సం" (అర్థరిటీస్ – మెడిసిన్ కొరకు) పాలికల వీధి, దొండపర్తి, 27వార్డ్ కి రూ.5,000/-లు. బక్రీద్ శు భాకాంక్షలు తెల్పుతూ ఇద్దరు ముస్లిం సోదరులకు చెరో రూ.1,500/-లు చొప్పున మొత్తం రూ.3,000/- లు లిఆపదలో ఉన్నవారికి సకాలంలో ఆదుకొనే ఆపద్బాంధవుడు ఎమ్మెల్య వాసుపల్లిలి లివైస్సార్సీపీ కార్యకర్తలకు అండగా ఎమ్మెల్యే వాసుపల్లి సేవలు అమోఘంలి లినిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవకై పరితపించే నాయకుడు ఎమ్మెల్యే వాసుపల్లిలి లిఅనారోగ్యం తో బాధపడుతున్నవారిని పరామర్శించి వారికి ధైర్యం చెప్తూ వారికి మందుల ఖర్చుల నిమిత్తం ఆర్థిక చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి రూ.5,000/- లు 27వార్డ్ దొండపర్తి, రామాలయం వీధి లో నివసించే లిచల్లా సాయిరాం రెడ్డిలి 53సంవత్సరాల వయస్సు గల వైస్సార్సీపీ కార్యకర్త షుగర్ వ్యాధి వలన ఎడమ కాలు కొంతభాగం తీసేసారని జీవనోపాదిలేక ఇబ్బందిగా ఉందని లిప్రజాదర్బార్‌లి లో వారి కుటుంబ సభ్యులు విన్నవించగా నేడు వారి ఇంటికి వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకొని తన సొంత నిధుల నుండి రూ..5,000/-లు ఆర్థిక సహాయం చేయడమే కాకుండా కింగ్ జార్జ్ హాస్పిటల్ లో మెరుగైన వైద్యం చేయిస్తామని హామీ ఎమ్మెల్యే వాసుపల్లి. రూ.5,000/-లు 27వార్డ్ దొండపర్తి, పాలికల వీధి లో నివసించే లిచెల్లూరు రోహిత మహిలి 12సం" కొన్ని నెలల నుండి అర్థరిటీస్ వ్యాధి %ు% నరాల బలహీనత తో బాధపడుతున్నారని, ఒక్కో అవయవం పాడవుతుందని, క్రమేపి పాప పెరుగుదల క్షీణించి, వైస్సార్ ఆరోగ్య శ్రీ లో ట్రీట్మెంట్ కి అవకాశం లేకపోవుట వలన వైద్యం కొరకు చాలా డబ్బులు ఖర్చవుతున్నాయని మంగళవారం లిప్రజాదర్బార్‌లి లో తెలియగానే నేడు వారి ఇంటికి వెళ్లి తన సొంత నిధుల నుండి ?.5,000/-లు ఆర్థిక సహాయం చేయడమే కాకుండా వైద్యం కొరకు ఖర్చు పెట్టిన డబ్బులు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా తెప్పిస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే. అక్కడున్న ప్రజలందరూ ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలియజేసారు.

బక్రీద్ శుభాకాంక్షలు తెల్పుతూ ఇద్దరు ముస్లిం సోదరులకు చెరో రూ.1,500/-లు చొప్పున మొత్తం రూ.3,000/- లు లిఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారా లబ్ది పొందిన వారు &వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కి జీవితాంతం రుణపడి ఉంటామని సీఎం జగన్ మోహన్ రెడ్డి కి & ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలియజేసారు.లి ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే తో 27వార్డ్ ప్రెసిడెంట్ నీలాపు సర్వేశ్వర రెడ్డి, స్టేట్ రోడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అమ్మాజీ, వైస్సార్సీపీ సీనియర్ నాయకులు మధు, అనిల్, అశోక్, రాజా, ప్రకాష్, అంగటి కుమారి, మల్లేశ్వరి, టేకేటి లక్ష్మి, నాగరాజు, మణి, అప్పారావు వైస్సార్సీపీ కార్యకర్తలు, సచి వాలయం కన్వీనర్స్, గృహశారదులు తదితరులు హాజరయ్యారు.

# డబుల్ ధమాకా




కొన్నిసార్లు కాల్షీట్లు... మరికొన్నిసార్లు రకరకాల సమీకరణలతో అవకాశాలు అటూ ఇటూ అవుతుంటాయి తప్ప, కథానాయికల కెరీర్‌లకి మాత్రం ఢోకానే లేదు. పరాజయాలు పలకరించినా సరే, కాస్త మనసు పెడితే మంచి అవకాశాలే సొంతం అవుతున్నాయి. అసలే కథానాయికల కొరత మరీ! ఒకప్పుడు తెలుగులో రెండు మూడు సినిమాలతో బిజీగా కనిపించిన పూజాహెగ్డే ఉన్నట్టుండి ఖాళీ అయ్యింది. మహేశ్ సినిమా 'గుంటూరు కారం'లో ఓ కథానాయికగా ఎంపికైనా, ఈ మధ్యే మార్పు చేర్పులతో ఆమె తప్పుకోవల్సి వచ్చింది. ఉన్న ఒక్క సినిమా పూజా చేజారిందే అనుకునేలోపే ఆమె, డబుల్ ధమాకాకి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇద్దరు యువ హీరోలు చేస్తున్న సినిమాల్లో ఆమెకి కథానాయికగా అవకాశాలు దక్కినట్టు సమాచారం. దుల్కర్ సల్మాన్, సాయిధరమ్ తేజ్‌లతో ఆమె జోడీ కట్టే అవకాశాలున్నట్టు సమాచారం. ప్రస్తుతం అందుకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. మరో భామ నభా నటేశ్‌కీ కొన్నాళ్లుగా తెలుగులో సినిమాలు లేవు. తాజాగా రెండు కీలకమైన ప్రాజెక్టుల విషయంలో ఆమె పేరు కూడా వినిపిస్తోంది. బెల్లంకొండ శ్రీనివాస్ కథానాయకుడిగా సాగర్ కె.చంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా కోసం నభానటేశ్ పేరుని పరిశీలిస్తున్నారు. నాగశౌర్యతోనూ ఆమె ఓ సినిమా కోసం జోడీ కట్టనున్నట్టు తెలుస్తోంది. అన్నీ కుదిరితే ఈ ఇద్దరు భామలు డబుల్ ధమాకాతో సందడి చేయడం ఖాయం అని పరిశ్రమ వర్గాలు




# 'బ్రో' కొత్త పోస్టర్



మేనల్లుడు సాయిధరమ్‌తో కలిసి పవన్ 'బ్రో' మూవీ చేస్తున్నాడు. తమిళంలో సూపర్ హిట్టయిన 'వినోదయ సిత్తం'కు రీమేక్‌గా ఈ సినిమా తెరకెక్కుతుంది. ఒరిజినల్ వెర్షన్‌ను తెర కెక్కించిన సముద్రఖని రీమేక్ వెర్షన్‌ను కూడా తెరకెక్కిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం ప్యాచ్ వర్క్‌ను కంప్లీట్ చేసుకుంది. ఈ నేపథ్యంలో ఓ పోస్టర్ విడుదల చేశారు మేకర్స్. టీజర్ అప్‌డేట్‌ను త్వరలోనే ప్రకటించ బోతున్నారు. పోస్టర్‌లో పవన్, సాయిధరమ్ లుంగీలు కట్టుకుని, మెడల ఎర్ర కండువా వేసుకుని కూలీ గెటప్‌లో కనిపించారు. ఒక యాక్సిడెంట్‌లో చనిపోయిన ఓ వ్యక్తి.. తాను చేయాల్సిన పనుల కోసం తిరిగి భూమి మీదకు రావడం, వాటిని పూర్తి చేయడం వంటి కథాంశంతో ఈ సినిమా సాగుతుంది. తెలుగు నెటివిటీకి తగ్గట్లు త్రివిక్రమ్ పలు మార్పులు చేర్పులు చేశారు. పీపుల్ మీడియా సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తున్నాడు.

# విడాకుల వార్తలపై నటి ఆసిన్ క్లారిటీ



తన భర్త రాహుల్ శర్మ నుంచి నటి ఆసిన్ విడాకులు తీసుకోనున్నారంటూ గత కొన్ని రోజుల నుంచి వార్తలు చక్కర్లు కొదు తున్నాయి. ఈ వార్తలపై తాజాగా ఆసిన్ స్పందించారు. ఆయా వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు.

"సమ్మర్ హాలీడేను ఎంజాయ్ చేస్తోన్న తరుణంలో కొన్ని నిరాధారమైన వార్తలు మా కంట పడ్డాయి. వాటిని చూశాక.. పెళ్లి కోసం ఇరు కుటుంబాల పెద్దలను ఒప్పించిన ఆనాటి రోజులు మాకు గుర్తుకు వచ్చాయి. మేమిద్దరం విడిపోయామంటూ వస్తోన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు. దయచేసి కాస్త ఆలోచించి వార్తలు రాయండి. అద్భుతమైన హాలీడేలో ఇలాంటి వాటి కోసం ఐదు నిమిషాలు కేటాయించాల్సి వచ్చినందుకు చింతిస్తున్నా" అని ఆసిన్ పోస్ట్ పెట్టారు. 'అమ్మ నాన్న ఓ తమిళ అమ్మాయి'తో తెలుగు తెరకు పరిచయమైన ఆసిన్.. 'శివమణి', 'గజినీ', 'ఘర్షణ', 'పోకిరి' (తమిళ వెర్షన్), 'మజా', 'దశావతారం' వంటి దక్షిణాది చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 'హౌస్‌ఫుల్ 2', 'లండన్ డ్రీమ్స్'.. ఇలా పలు హిందీ సినిమాల్లోనూ ఆమె కీలకపాత్ర పోషించారు. బాలీవుడ్‌లో నటిస్తోన్న తరుణంలోనే మైక్రోమ్యాక్స్ ఫౌండర్ రాహుల్ శర్మతో ఆమె ప్రేమలో పడ్డారు. పెద్దల అంగీకారంతో ఈ జంట 2016లో వివాహం చేసుకుంది. పెళ్లి తర్వాత ఆసిన్ సినిమాలకు దూరమయ్యారు. ఇదిలా ఉండగా, తన భర్తతో దిగిన ఫొటోలను ఆసిన్ ఇటీవల ఇన్‌స్టాగ్రామ్ నుంచి తొలగించారు. దీంతో ఆమె విడాకులు తీసుకోనుందంటూ ప్రచారం తెరపైకి వచ్చింది.



# 'లస్ట్ స్టోరీస్2' పేరు చూసి మోసపోకండి..

## అందరితో కలిసి చూడండి: తమన్నా






మిల్కీ బ్యూటీ తమన్నానటించిన కొత్త వెబ్‌సిరీస్ 'లస్ట్ స్టోరీస్2'. ఈనెల 29 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఇది ప్రసారం కానుంది. ఈ నేపథ్యంలో ప్రచారాన్ని షురూ చేసింది నిర్మాణ సంస్థ. ఇందులో భాగంగా తమన్నా తన ట్విటర్‌లో ఓ వీడియో పోస్ట్ చేసింది. దీన్ని చూసేప్పుడు ఎవరైనా వస్తే మధ్యలో ఆపేయాల్సిన అవసరం లేదని చెప్పింది.

"లస్ట్ స్టోరీస్2' ఎన్నో రకాల భావోద్వేగాల కలయిక. లస్ట్ అనే పేరు చూసి మోసపోకండి. ఇందులో అందరి ప్రేమను అద్భుతంగా చూపించారు. అమ్మ, బామ్మ, పనిమనిషి.. ఇలా ఎంతోమంది ప్రేమలు ఇందులో ఉన్నాయి. ఈ సిరీస్ చూసేటప్పుడు ఎవరైనా వస్తే కంగారు పడి ఆపేయకండి. అందరితో కలిసి దీన్ని చూడండి. అలా చూస్తే ఏమవుతుంది..? తుపానేమీ రాదు, ఆకాశం ఊడి కిందపడదు, వైఫై కనెక్షన్ ఒక్కసారిగా ఆగిపోదు కదా? మరెందుకు భయం. రిలాక్స్ అవుతూ దీన్ని చూడండి" అని చెప్పింది. అయితే దీనిపై నెటిజన్లు సరదాగా కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఈ యూత్‌ఫుల్, రొమాంటిక్ డ్రామాలో భాగంగా నటుడు, తన ప్రియుడు విజయ్ వర్మతో తమన్నా ఆన్‌స్క్రీన్‌పై ముద్దు సన్నివేశాల్లో కనిపించింది. దీని కోసం సుమారు 18 ఏళ్ల నుంచి తాను ఫాలో అవుతోన్న నో కిస్ పాలసీని బ్రేక్ చేసింది. దీనిపై మాట్లాడుతూ కాలానుగుణంగా మారే వ్యక్తుల్లో తాను ఒకదాన్నని పేర్కొంది. ఒక నటిగా సృజనాత్మకత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పింది. సినీ ఇండస్ట్రీకి వచ్చిన 18 ఏళ్ల తర్వాత ఫేమస్ అవ్వాల్సిన అవసరం తనకు లేదని స్పష్టం చేసింది.

2018లో విడుదలై, విశేష ప్రేక్షకాదరణ సొంతం చేసుకున్న వెబ్ సిరీస్‌ల్లో 'లస్ట్ స్టోరీస్' ఒకటి. ఇప్పుడు దానికి కొనసాగింపుగా 'లస్ట్‌స్టోరీస్ 2' వస్తోంది. కాజోల్, తమన్నా, మృణాల్ ఠాకూర్, విజయ్ వర్మ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

# 'భాగ్ సాలే' టీమ్‌కు మెగాస్టార్ చిరంజీవి ప్రశంస



శ్రీసింహా కోడూరి హీరోగా నటించిన కొత్త సినిమా భాగ్ సాలే. జూలై 7న భాగ్ సాలే విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా ఈ చిత్ర టీమ్‌ను మెగాస్టార్ చిరంజీవి ప్రశంసించారు. "భాగ్ సాలే సినిమా ట్రైలర్ బాగుంది. శ్రీసింహా తనకంటూ ఓ ప్రత్యేక ఇమేజ్ ఏర్పర్చు కుంటున్నాడు. కామెడీ, మాస్, ఎంటర్ టైనింగ్ తో పాటు క్రైమ్ అంశాలతో సినిమాలు చేస్తూ పేరు తెచ్చుకుంటున్నాడు. శ్రీసింహా కీరవాణి గారి అబ్బాయి అని అతను హీరోగా పేరు తెచ్చుకునే దాకా నాకు తెలియదు. వారసుడిగా కాకుండా తను స్వతహాగా ఎదగాలని ప్రయత్నిస్తున్నాడు. కీరవాణి గారికి పేరు తెచ్చేంతగా గుర్తింపు సంపాదించుకోవాలని కోరుకుంటున్నా. అలాగే కాలభైరవ అంటే చరణ్‌కు చాలా ఇష్టం. వీరిద్దరు మత్తు వదలరా సినిమాతో సక్సెస్ అందుకున్నారు. ఇకపైనా మంచి అవకాశాలతో తమ ప్రతిభను చాటు కోవాలి. దర్శకుడు ప్రణీత్ బ్రహ్మాండంగా ఈ సినిమాను రూపొందించాడు. అలాగే నిర్మాత అర్జున్ దాస్యన్ మంచి ప్రయత్నం చేశాడు. ఈ సినిమా జూలై 7న విడుదలవుతోంది. సినిమా సూపర్ హిట్ కావాలని కోరుకుంటున్నాను." అని అన్నారు. అన్నారు.

# అప్పుడు సచిన్‌లానే ఇప్పుడు విరాట్..

## అతడి కోసం వరల్డ్ కప్ గెలవాలి : సెహ్వాగ్




1983లో ఎలాంటి అంచనాలు లేకుండా బరిలోకి దిగి ప్రపంచకప్‌ను భారత్‌కు అందించి కపిల్ సేన చరిత్ర లిఖించింది. ఆ తర్వాత 28 ఏళ్లకు.. ధోనీ సేన రెండోసారి వరల్డ్ కప్‌ను ముద్దాడి భారత అభిమానుల కలను నెరవేర్చింది. ఇప్పుడు 12 ఏళ్ల అనంతరం మరోసారి స్వదేశం వేదికగా ఈ మెగాటోర్నీ జరగనుంది. ఈ నేపథ్యంలో మరోసారి కప్ గెలిచి.. సుదీర్ఘకాలంగా ఉన్న ఐసీసీ ట్రోఫీల కొరతను తీర్చాలని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో మాజీ ఆటగాడు సెహ్వాగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అప్పుడు తాము సచిన్ కోసం ప్రపంచకప్ గెలిచామని.. ఇప్పుడు విరాట్ కోహ్లీ కోసం కప్ గెలవాల్సిన అవసరముందని సెహ్వాగ్ చెప్పాడు. "మేం అప్పుడు సచిన్ తెందూల్కర్ కోసం ప్రపంచకప్ ఆడాం.. గెలిచాం. దీంతో దిగ్గజ క్రికెటర్‌కు ఘనంగా వీడ్కోలు చెప్పాం. అప్పుడు సచిన్ ఎలానో.. ఇప్పుడు కోహ్లీ అలాగే ఉన్నాడు. విరాట్ ఆట, మాట తీరు, చూపులు, ఆటపై అతడికుండే మక్కువ.. ఇవన్నీ సచిన్‌ను తలపిస్తాయి. అందుకే అతడి కోసం ప్రపంచకప్ గెలవాలని అందరూ కోరుకుంటున్నారు.

# రివ్యూ : సామజవరగమన




వైవిధ్యమైన కథలకు.. పసందైన వినోదాలకు నెలవుగా నిలుస్తుంటాయి శ్రీవిష్ణు చిత్రాలు. అదే ఆయన బలం కూడా. అయితే ఇటీవల ఇమేజ్‌ను మార్చుకునే క్రమంలో మాస్ యాక్షన్ కథల వైపు దృష్టి సారించి వరుసగా చేదు ఫలితాలు అందుకున్నారు. దీంతో ఆయన తనకు బాగా కలిసొచ్చిన పంథాలోకే తిరిగి అడుగు పెట్టారు. 'వివాహ భోజనంబు' సినిమాతో ప్రేక్షకుల్ని నవ్వించిన దర్శకుడు రామ్ అబ్బరాజుతో కలిసి 'సామజవరగమన' అనే వినోదాత్మక చిత్రాన్ని సిద్ధం చేశారు. సినిమా విడుదల నేపథ్యంలో టీమ్ ప్రివ్యూ షో వేసింది. ఆ సినిమా రివ్యూ మీ కోసం.కథేంటంటే: బాలు (శ్రీవిష్ణు) ఏషియన్ మల్టీప్లెక్స్‌లో ఉద్యోగం చేస్తుంటాడు. సంపాదించే ప్రతి రూపాయిని జాగ్రత్తగా ఖర్చు పెట్టే సగటు మధ్యతరగతి వ్యక్తి మనస్తత్వం తనది. తండ్రి ఉమా మహేశ్వరరావు (నరేష్)ను డిగ్రీ పాస్ చేయించేందుకు తిప్పలు పడుతుంటాడు. ఎందుకంటే ఆయన డిగ్రీ పూర్తి చేస్తేనే తన తాత వీలునామా ప్రకారం కోట్ల రూపాయల ఆస్తి చేతికొస్తుంది. ఆయన డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలు రాసే క్రమంలో సరయు (రెబా మోనికా జాన్)తో పరిచయం ఏర్పడుతుంది. ఆ తర్వాత ఆమె పేయింగ్ గెస్ట్‌గా బాలు ఇంట్లోకి అడుగు పెడుతుంది. 'ఐ లవ్ యూ' అంటే చాలు ఆ చెప్పిన అమ్మాయితో బలవంతంగా రాఖీ కట్టించుకునే బాలు, సరయుతో ప్రేమలో పడతాడు. ఇద్దరూ పెద్దల్ని ఒప్పించి పెళ్లి చేసుకోవడానికి ఓ ప్రణాళిక కూడా రచిస్తారు. అయితే తన బావ పెళ్లి బాలుకు ఓ విచిత్రమైన సమస్య తెచ్చిపెడుతుంది. మరి ఆ సమస్య ఏంటి? తన బావ పెళ్లికి.. బాలు- సరయు ప్రేమకథకు ఉన్న లింకేంటి? అసలు సరయు కుటుంబ నేపథ్యమేంటి? వీళ్ల ప్రేమ కథ చివరకు ఏమైంది? బాలు తండ్రి డిగ్రీ పాసై తన ఆస్తి దక్కించుకున్నాడా? లేదా? అన్నవి తెరపై చూసి తెలుసుకోవాలి

ఎలా ఉందంటే: 'ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించడమే లక్ష్యంగా చేసిన చిత్రమిది'.. శ్రీవిష్ణు ప్రతి ఇంటర్వ్యూలో ఈ సినిమా గురించి చెప్పిన మాటిది. ఈ చిత్రం మొదలైనప్పటి నుంచి ముగింపు వరకు తెరపై కనిపించే ప్రతి సీన్ ఆయన చెప్పిన మాటకు అనుగుణంగా నవ్వులు పూయిస్తూ సాగుతుంది. నిజానికి ఈ చిత్ర లైన్ చాలా చిన్నదే అయినా దాన్ని అల్లుకున్న తీరులోనే ఓ కొత్తదనం ఉంది. సాధారణంగా ప్రతి సినిమాలో కొడుకు సరిగా చదవట్లేదంటూ సతాయించే తండ్రుల్ని చూశాం. కానీ, ఇందులో వెరైటీగా కొడుకే తండ్రిని చదువుకోమంటూ సతాయిస్తుంటాడు. తండ్రిని డిగ్రీ పాస్ చేయించేందుకు రకరకాల తిప్పలు పడుతుంటాడు. ఆ ప్రయత్నాలన్నీ ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్విస్తుంటాయి. సినిమా ప్రథమార్ధమంతా ప్రధానంగా ఈ ట్రాక్‌పైన ఆధారపడి ముందుకు సాగుతుంది. ఉద్యోగం నుంచి రిటైర్ అయ్యే వయసులో డిగ్రీ పరీక్షలు రాస్తూ నరేష్ పడే ఇబ్బందులు.. తండ్రిని ఎలాగైనా పాస్ చేయించాలని కొడుకు పడే తపన..

ఈ తండ్రీకొడుకుల మధ్య వచ్చే చిన్న చిన్న గొడవలు.. ప్రతిదీ సరదాగా సాగుతూ నవ్విస్తుంది. హీరో ఇంట్లోకి కథానాయిక పేయింగ్ గెస్ట్‌గా ఎంటర్ అయ్యాక కథ మరో మలుపు తిరుగుతుంది. తన ఇంట్లోకి వచ్చిన సరయును బాలు ట్రీట్ చేసే తీరు.. అతని ప్రవర్తనతో ఆమె పడే ఇబ్బందులు ఫన్నీగా అనిపిస్తాయి. తనకు ఐ లవ్ యూ చెప్పిన అమ్మాయిలతో బాలు రాఖీ కట్టించుకోవడం వెనకున్న కథ కూడా సరదాగా ఉంటుంది.

ఇక రాఖీ పండగను అమ్మాయిలు ఎలా కమర్షియల్‌గా మార్చారో వివరిస్తూ.. బాలు ఇచ్చే ఓ నాన్‌స్టాప్ లెక్చర్ కుర్రాళ్లతో విజిల్స్ వేయిస్తుంది. సరయుతో బాలు ప్రేమలో పడే సన్నివేశాలు చాలా కన్విన్సింగ్‌గా ఉంటాయి. దీని కోసం దర్శకుడు రాసుకున్న ట్రాక్ కూడా కొత్తగానే అనిపిస్తుంది. విరామానికి ముందు వీళ్ల ప్రేమకథలో వచ్చే ట్విస్ట్ ద్వితీయార్ధం ఏం జరుగుతుందన్న ఆసక్తిని కలిగిస్తుంది. తన బావ పెళ్లి వల్ల బాలు ప్రేమకథకు ఎదురైన విచిత్రమైన సమస్యతో ద్వితీయార్ధం మొదలవుతుంది. సరయు కుటుంబం.. వాళ్ల పాత్రల్ని తీర్చిదిద్దిన తీరు.. వాళ్ల అతి ప్రేమానురాగాలతో బాలు, అతని కుటుంబం పడే ఇబ్బందులు ఆద్యంతం నవ్వులు పూయిస్తాయి.

ఇక బాలుకు రాఖీ కట్టించేందుకు సరయు తండ్రి తన కుటుంబంతో ఇంటికి వచ్చి చేసే హంగామా.. దాన్ని తప్పించుకునేందుకు బాలు పడే పాట్లు ఎంతో సరదాగా అనిపిస్తాయి.

# సీఎం జగన్ వ్యాఖ్యలకు గంటా కౌంటర్

## ఆ సంగతి మర్చిపోయారా అని ప్రశ్న
## వీడియోను ట్వీట్ చేసిన మాజీ మంత్రి



విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కురుపాంలో అమ్మఒడి నిధుల్ని బటన్ నొక్కి తల్లుల ఖాతాల్లో జమ చేశారు. సభలో ప్రతిపక్షాలపై మండిపడ్డారు. చంద్రబాబు ఏనాడూ మంచి గురించి ఆలోచించలేదని.. టీడీపీ అంటే టీ అంటే తినుకో.. డీ అంటే దండుకో.. పీ అంటే పంచుకోగా మార్చేశారని మండి పడ్డారు. మరోసారి అధికారం ఇవ్వండంటూ మరోసారి మేనిఫెస్టోతో మళ్లీ మోసానికి దిగారని ధ్వజమెత్తారు. చంద్రబాబు దత్తపుత్రుడు, ప్యాకేజీ స్టార్ వారాహి అనే ఓ లారీ ఎక్కి ఊగిపోతున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశరు. చెప్పుతో కొడతానంటూ, తాట తీస్తానంటూ ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ మనిషి నోటికి అదుపు లేదని.. ఆయనకు నిలకడా లేదన్నారు. దత్తపుత్రుడిలా తొడలు కొట్టలేం.. పూనకం వచ్చినట్లు ఊగిపోతూ బూతులు తిట్టలేం అన్నారు. వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలకు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు కౌంటర్ ఇచ్చారు. 'జగన్మోహన్ రెడ్డి గారు కురుపాం పర్యటనలో ప్రతిపక్ష నాయకులను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ వారి నోటికి అడ్డూ అదుపు లేదని, ఆ రౌడీల మాదిరిగా మేము తొడ కొట్టలేమని, బూతులు తిట్టలేమని, వ్యాఖ్యానించడం చాలా హాస్యాస్పదంగా ఉంది. జగన్మోహన్ రెడ్డి గారు మరి మీరు ఆనాడు ప్రతిపక్ష నేతగా ఉండి రాష్ట్ర ముఖ్యమంత్రిని నడిరోడ్డు మీద కాల్చి చంపాలి, చెప్పులతో కొట్టాలి, చీపుర్లు చూపించాలంటూ స్వరాన్ని పెంచి మాట్లాడిన మీ మాటలు మర్చిపోయారా' అంటూ వీడియోను ట్వీట్ చేశారు.

'మీరు ఒక ముఖ్యమంత్రి హోదాలో మీ స్థాయి మర్చిపోయి పబ్లిక్ మీటింగ్ లో.. నా వెంట్రుక కూడా పీకలేరు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి మర్చిపోయారా..? ఈరోజు మీ మాటలు వింటుంటే గురివింద గింజ సామెతను గుర్తుకొస్తుంది జగన్మోహన్ రెడ్డి గారు' అంటూ మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ట్విట్టర్ వేదికగా ఎద్దేవా చేశారు.

మరోవైపు అమ్మఒడి పథకంపై సీఎం జగన్ చేసిన ట్వీట్‌కు.. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రశ్నలతో కౌంటర్ ట్వీట్ చేశారు.

ఎన్నికలకు ముందు మాటలు.. నేటి కోతలు అంటూ టార్గెట్ చేశారు. 'అమ్మఒడి పై సైతం నువ్వు చెప్పేవన్నీ (పచ్చి) అబద్దాలే కదా జగన్ రెడ్డీ!. రాష్ట్రంలో అమ్మఒడి పథకానికి లబ్దిదారులు 83 లక్షల మంది పైగా ఉంటే... మీరు ఇచ్చేది ఎంతమందికి?. ఇంట్లో ఎంత మంది విద్యార్థులు ఉంటే అంతమందికీ రూ.15 వేలు చొప్పున ఇస్తానని ఎన్నికలకు ముందు చెప్పింది వాస్తవం కదా? ఇద్దరు బిడ్డలు ఉంటే...ఒక్కరికే పథకం ఇవ్వడం వివక్ష కాదా? ఇప్పుడు ఇస్తున్నది ఎంత...దాంట్లో కోస్తున్నది ఎంత?' అన్నారు.

# శేష పాన్పు అవతారంలో జగన్నాథ స్వామి

- నేడు జగన్నాథ స్వామి తిరుగు రథయాత్ర
- జూలై 13న వెల్ఫేర్ గ్రూప్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం



పూర్ణమార్కెట్ (విజయభాను న్యూస్): శ్రీ క్షేత్ర స్వరూపుడు జగన్నాథ స్వామి "శేష పాన్పు అవతారం"రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. విశాఖ పాత నగరం టౌన్ కొత్త రోడ్ లో ఉన్న శ్రీ జగన్నాథ స్వామి దేవస్థానం వార్షిక రథోత్సవ మహోత్సవాలు పురస్కరించుకొని టర్నర్ చౌల్ట్రీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన జగన్నాథ స్వామి దశావతారాల ముగింపు ఉత్సవాల్లో భాగంగా గురువారం సుభద్ర బలభద్ర సమేత జగన్నాథుని లక్ష్మీనారాయణ శేష పాన్పు అవతారం అలంకారంలో సుందరంగా అలంకరించారు. ఉదయం జగన్నాథ స్వామి కి మేలుకొలుపు, నాదస్వర విన్యాసం, నిత్య పూజ ఉభయ దాతల గోత్రనామాలతో పూజాధికాలు నిర్వహించారు. జగన్నాథ స్వామి ప్రార్థన గాన సంఘంచే ప్రార్థన తరంగిణి కార్యక్రమం, లలిత సహస్ర నామ పారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో టీ. రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ గురువారం శేష పాన్పు అవతారంతో జగన్నాథ స్వామి అవతార ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. 30న శుక్రవారం ఉదయం 10 గంటల ఐదు నిమిషాలకు జగన్నాథ స్వామిని తిరుగు రథయాత్రకు రథంపై అధిష్ఠించడం జరుగుతుందన్నారు. సాయంత్రం వరకు రథంపై ఉన్న జగన్నాథ స్వామిని భక్తులు దర్శనం చేసుకుంటారని, సాయంత్రం 5:10 నిమిషాలకు రథంపై కొలువైన బలబద్ర సుభద్ర దేవి సమేత జగన్నాథ స్వామి దేవతామూర్తులను తిరుగు రథయాత్ర అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. టర్నర్ చౌల్ట్రీ జంక్షన్ నుంచి టౌన్ కొత్త రోడ్డు రథంపై కొలువైన జగన్నాథ స్వామిని దేవస్థానం వరకు వేద పండితుల పారాయణం, భక్తుల జగన్నాథ స్మరణతో, మేళతాళాలతో, మంగళ వాయిద్యాలతో, బాణాసంచ కాల్పులతో స్వామి తిరుగు రథయాత్ర వైభవంగా నిర్వహిస్తామన్నారు. జగన్నాథ స్వామి దశావతార అలంకారాలకు, స్టేజి అలంకారానికి, ఇతర సహాయ సహకారాలు అందించిన సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణకు ఈ సందర్భంగా ఈవో కృతజ్ఞతా పూర్వక ధన్యవాదాలు తెలిపారు. వచ్చేనెల జూలై 13న గురువారం మధ్యాహ్నం 12 గంటలకు వెల్ఫేర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత, ఏపీ స్టేట్ ఈడబ్ల్యూఐడిసి చైర్మన్ డాక్టర్ మల్ల విజయప్రసాద్ అరుణ కుమారి దంపతుల ఆర్థిక సహాయంతో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.జగన్నాథుని అవతార ఉత్సవాలలో పది రోజులు పాటు దాతల సహాయంతో నిత్యాన్నదానం ప్రతిరోజు మధ్యాహ్నం నిర్వహించినట్లు తెలిపారు. గురువారం సాయంత్రం 6 నుంచి 7.30 వరకు శ్రీ శ్రీ మ్యూజిక్ వారిచే బాల లీలామృతం, అనంతరం శ్రీహరి సంకీర్తన సేవా సంస్థ, అన్నమయ్య గీతాంజలి ప్రధాన కార్యదర్శి ఎం వి రాజశేఖర్ సారథ్యంలో అన్నమాచార్య సంకీర్తనలు ఉంటాయన్నారు.

# దేశ ప్రజల్ని ప్రధాని మోదీ కన్‌ఫ్యూజ్ చేస్తున్నారు: సీఎం స్టాలిన్



చెన్నై: దేశంలో ఉమ్మడి పౌర స్మృతి అమలు చేయాల్సి అవసరం ఉందని ప్రధాని మోదీ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. దానిపై తమిళనాడు సీఎం స్టాలిన్ (స్పందించారు. దేశంలో మతపరమైన ఘర్షణలను సృష్టించేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని, ఎన్నికల్లో నెగ్గేందుకు ప్రజల్ని ఆయన కన్‌ఫ్యూజ్ చేస్తున్నారని స్టాలిన్ విమర్శించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలే గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు. పాట్నాలోని జరిగిన విపక్షాల భేటీ తర్వాత ప్రధాని మోదీ భయపడ్డారని, అందుకే ఆయన కుటుంబ రాజకీయాల గురించి మాట్లాడినట్లు స్టాలిన్ తెలిపారు. మాజీ సీఎం కరుణానిధి తనను కేవలం ఓ కుమారుడిలా చూడలేదని, ఆయనకు పార్టీ కార్యకర్తలు అంతా కుమారులే అని స్టాలిన్ పేర్కొన్నారు.

# రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ సెంటర్‌ను సందర్శించిన జివిఎంసి కమిషనర్



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** అభివృద్ధి, పర్యావరణ నియంత్రణ కొరకు రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ సెంటర్‌లు ఎంతో ఉపయోగపడతాయని జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. గురువారం ఆయన నగరంలోని ఎండాడ, తగరపువలస, గాజువాక, పెందుర్తి తదితర ప్రాంతాలలోని పలు త్రిబుల్ ఆర్ సెంటర్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ సెంటర్‌ల ద్వారా ఎంతో ఉపయోగముందని, తక్కువ వినియోగం, పునర్వినియోగం, శుద్ధి చేసి వినియోగం (త్రిబుల్ ఆర్) పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అభివృద్ధి, పర్యావరణ నియంత్రణ కోసం ఎంతో ఈ సెంటర్ ఉపయోగపడాలని, వ్యర్థాల నిర్వాహణకు స్థిరమైన అభివృద్ధికి బాటలు వేస్తాయని కమిషనర్ పేర్కొన్నారు. పదార్థాల్లో అనేక రకాల గాజు, కాగితం, మెటల్, ప్లాస్టిక్, టైర్లు, దుస్తులు, పుస్తకాలు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాల్ని ఈ త్రిబుల్ ఆర్ సెంటర్ ద్వారా సేకరించి తద్వారా రీసైకిల్ పిల్లలకు పనికొచ్చే ఆట వస్తువులతో పాటు వినియోగించుకోగలిగే అనేక వస్తువులు తయారు చేయొచ్చు అన్నారు. తదుపరి తగరపువలస, సబ్బివానిపాలెం లోని బుక్ కేఫ్ ను సందర్శించి పౌరులకు మంచి విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు అందుబాటులో ఉంచాలన్నారు.

ఈ సెంటర్లో ఏర్పాటు చేయుటకు తగిన సూచనలు, సలహాలు కూడా అధికారులకు కమిషనర్ గారు ఇవ్వడం జరిగినది. ఈ పర్యటనలో జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు శ్యాంసన్ రాజు, సత్యనారాయణ రాజు, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, ఏఎంఓహెచ్ కిషోర్, డి.ఈ, ఏ.ఈ.లు, ఎస్.ఎస్. లు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి శుభాకాంక్షలు



గాజువాక (విజయభాను న్యూస్) : ముస్లిం సోదరులకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఈద్-ఉల్-అదా(బక్రీద్) శుభాకాంక్షలు తెలియజేశారు. గాజువాక అజిమాబాద్ లో గల ఈద్ గాలో ఎమ్మెల్యే ముస్లిం సోదరులతో కలిసి నమాజ్ చేశారు. ముస్లిం సోదరులకు బక్రీద్ మంచి చేయాలని ఆకాంక్షించారు. కాగా అల్లా ఆదేశానుసారం ప్రవక్త ఇబ్రహీం తన కుమారుడైన ఇస్మాయిల్ ను బలి ఇవ్వడానికి తీసుకువెళ్లే సంప్రదాయాన్ని గుర్తు చేస్తు ఈ పండగను జరుపుకుంటారు. ఈ కార్యక్రమంలో గాజువాక వైకాపా ఇంచార్జ్ తిప్పల దేవన్, మాజీ కార్పొరేటర్ రఫీ వైకాపా నాయకులు షౌకత్ అలీ, ఎస్ ఎం డి గౌస్, ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# అందుకే ధోనీ బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకొస్తాడని తెలుసు..: ముత్తయ్య



న్యూఢిల్లీ : ఈ తరం భారత క్రికెట్ అభిమానులకు చిరస్మరణీయంగా గుర్తుండిపోయే సిక్స్ ఏదంటే.. ఠక్కున గుర్తుకొచ్చేది ఒకటే. అదే వన్డే ప్రపంచకప్-2011 ఫైనల్‌లో శ్రీలంకపై నాటి కెప్టెన్ ఎంఎస్ ధోనీ బాదిన సిక్స్. ఎందుకంటే దాదాపు 28 ఏళ్ల తర్వాత మరోసారి టీమ్ఇండియాకు వన్డే వరల్డ్ కప్ దక్కిన సందర్భం అది. సాధారణంగా లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు వచ్చే 'కెప్టెన్ కూల్' ఆ ఇన్నింగ్స్‌లో మాత్రం ఒక స్థానం ముందుకొచ్చి థర్డ్ డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగాడు. వాస్తవానికి ఆ స్థానంలో అప్పటికే మంచి ఫామ్‌లో ఉన్న యువరాజ్ సింగ్ రావాల్సి ఉంది. కానీ, అతడిని కాదని ధోనీ ముందుకొచ్చి కేవలం 79 బంతుల్లోనే 91 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. ఈ క్రమంలో ధోనీ ముందుకు రావడానికిగల ప్రధానం కారణం గురించి శ్రీలంక క్రికెట్ దిగ్గజం ముత్తయ్య మురళీధరన్ తాజాగా వెల్లడించాడు. వన్డే ప్రపంచకప్ 2023 షెడ్యూలింగ్ ఈవెంట్‌లో గత జ్ఞాపకాలను మాజీలు గుర్తు చేసుకుంటున్నారు. అందులో భాగంగా 2011 ఫైనల్ గురించి ముత్తయ్య ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

బ్యాటింగ్ ఆర్డర్‌లో యువీని కాదని ధోనీ ముందుకొస్తాడని తాము ముందే అంచనా వేశామని ముత్తయ్య వ్యాఖ్యానించాడు. "నా బౌలింగ్‌లో యువరాజ్ ఇబ్బంది పడేవాడు. యువీ అత్యుత్తమ క్రికెటర్ అనడంలో సందేహం లేదు. మిడిల్‌ఆర్డర్‌లో అతడు కీలక పాత్ర పోషించాడు. కానీ, నా బౌలింగ్‌లో ఇబ్బంది పడిన సందర్భాలున్నాయి. దీంతో ధోనీ బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకొచ్చాడు. అలా ఎందుకు వచ్చాడో కూడా మాకు తెలుసు. ఐపీఎల్ సందర్భంగా ధోనీకి నెట్స్‌లో ఎక్కువగా బంతులు వేశా. అతడికి నా బౌలింగ్‌పై మంచి అవగాహన ఉంది. దీంతో నాకు వికెట్ ఇవ్వకూడదనే కృతనిశ్చయంతో అతడే ముందుకు వచ్చాడు. నాకు ఆ మ్యాచ్‌లో వికెట్ దక్కకపోయినా పొదుపుగానే బౌలింగ్ చేశా. వాంఖడే స్టేడియంలో తేమ ప్రభావం ఎక్కువగా ఉంది. ఎక్కువగా బంతిని స్పిన్ చేయలేకపోయాం. ఒక ఎండ్‌లో గౌతమ్ గంభీర్ ఉన్నాడు. ఆ సమయంలో వికెట్ పడితే తప్పకుండా రైట్‌హ్యాండ్ బ్యాటర్ అయిన ధోనీ వస్తాడని ముందే అంచనా వేశాం" అని ముత్తయ్య మురళీధరన్ తెలిపాడు. ఫైనల్ మ్యాచ్‌లో మురళీ 8 ఓవర్లు వేసి వికెట్ లేకుండా 39 పరుగులు ఇచ్చాడు. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 274/6 స్కోరు సాధించగా.. భారత్ నాలుగు వికెట్ల నష్టానికి 48.2 ఓవర్లలో 277 పరుగులు చేసి విజయం సాధించింది

## నా ఆందోళనంతా ఆ ఆల్‌రౌండర్ గురించే : కపిల్ దేవ్

వన్డే ప్రపంచకప్-2023 షెడ్యూల్ వచ్చేసింది. అక్టోబర్ 5వ తేదీ నుంచి వరల్డ్ కప్ సంగ్రామం ప్రారంభంకానుంది. దాదాపు వంద రోజుల సమయం ఉంది. ఈలోగా టీమ్ఇండియా వెస్టిండీస్ పర్యటన, ఆసియా కప్, ఐర్లాండ్ సిరీస్‌లను ఆడనుంది. అయితే, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్, జస్ప్రీత్ బుమ్రా వంటి టాప్ ప్లేయర్లు గాయాలబారిన పడ్డారు. ప్రస్తుతం కోలుకుంటున్నప్పటికీ వన్డే వరల్డ్ కప్ నాటికి ఫిట్‌నెస్ సాధించి ఫామ్ అందుకొంటారో లేదోననే ఆందోళన అభిమానుల్లో ఉంది.

అయితే, టీమ్ఇండియా క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ మాత్రం ఒకే ఒక్క ఆటగాడి ఫామ్‌పై ఆందోళన వ్యక్తం చేశాడు. అతడే పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య "ప్రతి క్రీడాకారుడి జీవితంలో గాయాలు ఓ భాగం. అయితే, వేగంగా కోలుకుని మళ్లీ మైదానంలోకి అడుగు పెట్టాలి. ఇప్పటికే కొందరు కీలక ఆటగాళ్లు గాయపడ్డారు. కానీ, హార్దిక్ పాండ్య గురించే చాలా ఆందోళనగా ఉన్నా. భవిష్యత్తులో ఎలా ఆడతాడనేది వేచి చూడాలి. ఎందుకంటే అతడు త్వరగా గాయాలబారిన పడుతున్నాడు. ఒకవేళ ఆటగాళ్లందరూ ఫిట్‌గా ఉంటే మాత్రం టీమ్ఇండియా తప్పకుండా వరల్డ్ కప్‌లో అద్భుతంగా రాణిస్తుంది.

ఈ మెగా టోర్నీ ప్రతి నాలుగేళ్లకొకసారి వస్తుంది. అందుకే ప్రతి ఆటగాడు సిద్ధంగా ఉండాలి.

మ్యాచ్‌ల కోసం ఎక్కువగా సాధన చేయాలి. మరిన్ని వన్డేలను ఆడాలి" అని కపిల్ దేవ్ తెలిపాడు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⁎ Phone : 2564353, Fax : 0891-2569004 ⁎ e-mail: vijayabhanudaily@gmail.com